# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 81 | హైదరాబాద్ | గురువారం 11-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ఏడాదిలో 15 రోజులు మాత్రమే తెరుచుకునే రైల్వే స్టేషన్... పితృదేవతల కోసం ప్రత్యేకం!

## నేటి భారతం

- నువ్వు మట్టిలో బ్రతుకుతావు..
  మాకోసమే బ్రతుకుతావు..
- మట్టిని దైవంగా కొలుస్తావు..
  పైరును నీ ప్రాణంగా భావిస్తావు..
- నీ స్వేదంతో ఈ నేలను తడుపుతావు..
  నేల నుంచి సిరులు పండిస్తున్నావు..
- వానచుక్క కోసం పడిగాపులు కాస్తావు..
  కరువు రక్కసితో నిరంతరం యుద్ధం చేస్తుంటావు..
- ఎంతో కష్టపడి పంటసాగు చేస్తావు..
  గిట్టుబాటు ధరలేక రోదిస్తుంటావు..
- మా అందరికీ అన్నం పెడుతున్నావు..
  నువ్వు మాత్రం పురుగుల మందు సేవిస్తున్నావు..
- నీ పెదాలపై చిరునవ్వు మాకు శుభిక్షం రైతన్నా..
  ఇక నీ కన్నీరు మాకు దుర్భిక్షం రైతన్నా..
- రైతుల బ్రతుకు మారాల్సింది సినిమాల్లో కాదు..
  కథల్లో, కవితల్లో, భావోద్వేగమైన కథనాల్లో కాదు.. రైతుల జీవితాలు మారాల్సింది వ్యవసాయ క్షేత్రాల్లో..

## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే'.. ఈసీ

- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో సీఈసీ కీలక భేటీ
- ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా సవరణ
- ఈసీ చర్యను సమర్థించిన సుప్రీంకోర్టు ధర్మాసనం




**ఢిల్లీ, సెప్టెంబర్ 10 (భారత శక్తి) :** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే-ఎస్ఐఆర్) చేపట్టనున్నట్లు గతంలోనే ప్రకటించిన ఎన్నికల సంఘం..తాజాగా ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘాల ప్రధాన అధికారులతో దేశ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ మరికాసేపట్లో భేటీ కానున్నారు. తరువాయి 11లో



## హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్

- రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల భూమి కేటాయించాలని కోరిన సీఎం
- మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణంపై చర్చ
- తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశంపైనా ప్రస్తావన

11లో


11లో

## యూకే కొరడా..

### 20,000 మంది భారతీయుల భవితవ్యం ప్రశ్నార్థకం!

- బ్రిటన్‌లో భారతీయులకు బ్రేక్
- వీసాలపై ఉక్కుపాదం మోపనున్న కొత్త ప్రభుత్వం!

## రెవెన్యూ శాఖలో మార్పు ఎప్పుడు..?
# రైతు రోదన తీరేది ఎప్పుడు..?



12లో

- అడుగడుగునా అవినీతి అధికారులే..
- అన్నం పెట్టే రైతుల కడుపు కొడుతున్నారు..


అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రెవెన్యూ శాఖ అవినీతి కంపుతో నిండిపోయింది.. అన్నం పెట్టే రైతన్నల కడుపు కొడుతోంది.. అత్యధిక ఆదాయం కలిగిన రెవెన్యూ శాఖ అవినీతి అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది.. ఫైల్ కదలాలంటే లంచం.. పని జరగాలంటే లంచం.. సమస్య తీరాలంటే లంచం.. ఇలా లంచావతారాలు రెవెన్యూ శాఖలో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయారు..రెవెన్యూ అంటేనే ఆదాయం.. కానీ ఎవరికీ దక్కుతోంది ఈ ఆదాయం..? రైతులకు, ప్రభుత్వాలకు దక్కాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది.. అధికారులు కోట్లు వెనుకేసుకుంటుంటే.. రైతులు మాత్రం కన్నీళ్లు నింపుకుంటున్నారు.. ప్రభుత్వాల పనితీరు ఒకవైపు.. అధికారుల అవినీతి మరోవైపు.. కార్పొరేట్ సంస్థల దోపిడీ ఇంకోవైపు.. రాక్షసుల్లా రైతులను పీక్కుతింటున్నాయి.. ఒక ప్రభుత్వ ఆదేశిస్తే ఆఘమేఘాల మీద పరుగులు తీసే అధికారగణం..ఒక రైతు ఏదైనా చిన్న పనికోసం ఆఫీసులో అడుగుపెడదామంటే..గేటు దగ్గరే ఆపేస్తున్నారు.. రైతు సంక్షేమం, రైతు భరోసా అంటూ రంకెలు వేసే ప్రభుత్వ పెద్దలు కార్యాచరణలో చూపించడం లేదు..రైతుల కోసం ప్రాజెక్టులు అంటూ.. కోటాను కోట్లు దోచుకుంటున్నారు.. ఉన్నతమైన రెవెన్యూ శాఖ మకిలిపట్టిపోయింది.. డిపార్ట్మెంట్ లో పనిచేసే వారికి కనీసం వారానికి ఒక్కరోజైనా సెలవు ఉంటుంది.. కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తారు.. రైతు అలాకాదు సంవత్సరం రోజులు 24 గంటలు పనిచేయాల్సిందే.. అయినా సరే నాలుగు వేళ్ళు నోట్లోకి పోవడం లేదు.. ఒక పూట తింటే ఒక పూట పస్తులుండాల్సిందే.. రైతులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన రెవిన్యూ శాఖ రక్షణ మాట అటుంచి.. భక్షించడం మొదలుపెట్టింది.. ఇది ఎంతమాత్రం వాంఛనీయం కాదు..

## క్షమించరాని తప్పు చేశారు
## బీఆర్ఎస్ పై రేణుకా చౌదరి ఫైర్

- ఉప రాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్ ఎంపీలు
- బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి తీవ్ర విమర్శలు
- కాళేశ్వరం సీబీఐ విచారణ భయంతోనే ఓటింగ్ లో పాల్గొనలేదని ఆరోపణ



**హైదరాబాద్, సెప్టెంబర్ (భారత శక్తి) 10 :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరుగుతున్నందునే, ఆ భయంతో బీఆర్ఎస్ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. వారి చర్య ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, ఇది క్షమించరాని తప్పిదమని ఆమె అన్నారు. ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియపై ఆమె మీడియాతో తరువాయి 11లో



## నాది, పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటే

### రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం : ముఖ్యమంత్రి చంద్రబాబు

11లో

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో సహాయక కేంద్రం

- తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతల అప్పగింత
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచన



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (భారత శక్తి) :** నేపాల్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో పలువురు తెలంగాణవాసులు అక్కడ చిక్కుకుపోవడంతో, వారికి సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ సహాయ కేంద్రం బాధ్యతలను ముగ్గురు తరువాయి 11లో

భారత శక్తి

# వెనెజువెలాపై అమెరికా పడగనీడ

ఎడతెగని రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్ యుద్ధాలు ఇప్పటికే ప్రపంచానికి ప్రాణసంకటాలుగా తయారయ్యాయి. కీవ్‌పై మాస్కో ఏకపక్షంగా దండెత్తిన మొదటి ఏడాదిలోనే ప్రపంచ జీడీపీ, అంతర్జాతీయ వాణిజ్య ప్రగతి రెండు శాతం మేర తరుగుపడినట్లు పరిశీలనలు చెబుతున్నాయి. సరఫరా గొలుసులు దెబ్బతినడంతో ద్రవ్యోల్బణం ఎగబాకి చాలా దేశాల్లో ఆకలి కేకలూ మిన్నంటాయి. ఇక గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న కిరాతక నరమేధంలో ఇంతవరకు 64వేలకు పైగా పాలస్తీనీయుల ప్రాణాలు కడతేరిపోయాయి. సిరియా, సూడాన్, మయన్మార్ వంటివీ నేడు అంతర్యుద్ధాలతో సతమతమవుతున్నాయి. ఎప్పటికి అంతమవుతాయో తెలియని యుద్ధాలు, సాయుధ ఘర్షణలతో ఒక వక్క మానవతాదీపం కొండెక్కిపోతుంటే– బలప్రయోగంతోనైనా వెనెజువెలాను తన దారికి తెచ్చుకోవాలనే దుర్బుద్ధి అమెరికాలో ఎగదన్నుతోంది. ఆ మేరకు అగ్రరాజ్యం కరీబియన్ జలాల్లో యుద్ధనౌకలూ సైన్యాన్ని మోహరిస్తుండటం– కదన రక్కసి విలయ తాండవానికి బిక్కచచ్చిపోతున్న ప్రపంచాన్ని మరింతగా కలవరపరుస్తోంది!

ఇప్పుడంటే వెనెజువెలా పేరెత్తితేనే అమెరికా మండిపడుతోందిగానీ, ఒకప్పుడు అవి మంచి మిత్రదేశాలే. 1835లోనే వెనెజువెలా స్వాతంత్ర్యాన్ని వాషింగ్టన్ గుర్తించింది. ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలను కలిగిన వెనెజువెలా– అప్పట్లో అమెరికా ఇంధన అవసరాలను తీర్చడంలో ప్రధాన పాత్ర పోషించింది. 1980లలో అధునాతన ఎఫ్–16 యుద్ధవిమానాల బట్వాడాతో ఇరు దేశాల బంధం పతాకస్థాయికి చేరింది. హ్యూగో చావెజ్ నేతృత్వంలో 1999లో వెనెజువెలాలో సోషలిస్ట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ద్వైపాక్షిక సంబంధాల్లో క్షీణత మొదలైంది. చావెజ్ చమురు పరిశ్రమను జాతీయంచేసి పేదల జీవితాల్ని మెరుగుపరిచారు. ఆయన పాలనలో వెనెజువెలా ఒక వెలుగు వెలిగింది. 2014 తరవాత చమురు ధరలు పతనం కావడానికి తోడు అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలవల్ల స్థానికంగా ద్రవ్యోల్బణం మిన్నంటింది. చావెజ్ అనంతరం అధ్యక్షుడైన నికొలస్ మదురో అమెరికాకు కొరకరాని కొయ్యలా మారారు. డ్రగ్స్ అక్రమ రవాణాదారు అంటూ ఆయనపై డొనాల్డ్ ట్రంప్ నోరుపారేసుకుంటున్నారు. మదురోను తప్పించి తాను చెప్పినట్లు ఆడేవారిని గద్దెనెక్కించి వెనెజువెలా చమురును కాజేయాలని కలలుగంటున్నారు. అమెరికా తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని మదురో తేల్చిచెబుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎంతవరకు వెళ్తాయన్నది ఎవరికీ అంతుపట్టడం లేదు!

తాను ఏడు యుద్ధాలు ఆపానని ఒకసారి... మూడు కదనాలను కట్టడి చేశానని మరోసారి... ఇలా నోటికొచ్చిందల్లా చెబుతూ ట్రంప్ జబ్బలు చరచుకుంటున్నారు. ప్రపంచ శాంతికోసం పరితపిస్తున్న తనకు నోబెల్ బహుమతి ఎందుకివ్వరని మొండికేస్తున్నారు. నిజంగా ఆయన అంతటి శాంతికాముకుడే అయితే– మదురో సర్కారును కూల్చే కుట్రలకు తెర తీసేవారే కాదు. అతిప్రాచీన ప్రజాస్వామ్య దేశమనే తగరపు కిరీటాన్ని తగిలించుకున్న అమెరికా– వెనెజువెలా సార్వభౌమాధికారాన్ని గౌరవించకపోవడం ఏవిధంగానూ సమర్థనీయం కాజాలదు. శాంతి చర్చలతో వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుందామంటున్న మదురో పిలుపునకు ట్రంప్ సానుకూలంగా స్పందించాలి. ఆర్థిక, రాజకీయ అగచాట్ల నుంచి వెనెజువెలా తనకు తానుగా బయటపడేందుకు అమెరికా సహకరిస్తే అందరూ హర్షిస్తారు. అలా కాదని తన స్వార్థ ప్రయోజనాలకోసం ఎంతకైనా తెగించే కుతంత్రాలను అగ్రరాజ్యం కొనసాగిస్తే మాత్రం ప్రపంచం గుండెలపై మరో యుద్ధకుంపటిని రగిలించినట్లవుతుంది!

# విశాఖకు రూ.553 కోట్లు

విశాఖపట్టణం సెప్టెంబర్ 10

విశాఖ నగరం పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది కూటమి ప్రభుత్వం. ఇప్పటికే ఇక్కడ ఐటీ సంస్థల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. ఈ తరుణంలో మౌలిక వసతుల కల్పన పై ఫోకస్ పెట్టింది చంద్రబాబు సర్కార్. అత్యాధునిక తరహాలో సాగరనగరంలో మౌలికవసతుల కల్పన జరగనుంది. మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. అత్యాధునిక పరిజ్ఞానంతో విశాఖ నగరంలో మురుగు అనేది కనిపించకుండా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఐటీ పెట్టుబడులకు సంబంధించి ఇప్పటికే చాలాసంస్థలను ఆకర్షించింది. అయితే మరిన్ని పెట్టుబడులు రావాలంటే నగరం సుందరంగా కనిపించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఆసియాలోనే అతిపెద్ద మురుగునీటి వ్యవస్థను అందుబాటులోకి తేవాలని చూస్తోంది. ఇందుకుగాను రూ.553 కోట్లు ఖర్చు

చేయనుంది.ఇప్పుడు దేనికైనా ప్రపంచ బ్యాంకునిధులు చాలా కీలకం. ప్రస్తుతం అమరావతి రాజధాని నిర్మాణానికి సైతం ప్రపంచ బ్యాంకు నిధులు సమకూర్చిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు అదే ప్రపంచ బ్యాంకులో భాగమైన అంతర్జాతీయ ఆర్థిక సంస్థఐఎఫ్సి విశాఖలో ఆధునిక మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలోనే ఐఎఫ్సితో ఒప్పందం చేసుకుంది విశాఖ నగరపాలక సంస్థ. దీంతో దేశంలోని అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి ప్రత్యక్ష రుణం

పొందిన మొదటి కార్పొరేషన్ గా విశాఖ నగరపాలక సంస్థ గుర్తింపు దక్కించుకుంది.విశాఖ నగరంలో 100 డివిజన్లు ఉన్నాయి. కొన్ని వందల టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఆపై మురుగునీరు అసౌకర్యంగా ఉంది. అదే నీటిని శుద్ధి చేసి వ్యర్థాలను

బయటకు విడిచిపెట్టనున్నారు. నగరంలోని శివారు ప్రాంతంగా ఉన్న మధురవాడలో మురుగునీరు శుద్ధి చేసే ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఐఎఫ్సి నుంచి తీసుకున్న రుణాన్ని



ఎనిమిది పాయింట్ ఐదు శాతం వడ్డీతో నగరపాలక సంస్థ

తిరిగి వాయిదాల పద్ధతిలో చెల్లించనుంది. 15 ఏళ్ల కాలవ్యవధిలో మూడేళ్లు మారటోరియం గా ఉంటుంది. మిగిలిన 12 ఏళ్లలో నగర పాలక సంస్థ ఐ ఎఫ్ సి కి తిరిగి చెల్లించాల్సి ఉ ంటుంది రాబోయే 30 సంవత్సరాలలో విశాఖ నగరంలో జనాభా వృత్తిని

దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. భూగర్భ మురుగునీటి నెట్వర్క్ ప్రాధాన్యత అంశంగా తీసుకుని%ొ% హైయెస్ట్ టెక్నాలజీతో పంపింగ్, లిఫ్టింగ్ స్టేషనులు అందుబాటులోకి రానున్నాయి. ఇలా శుద్ధి చేసిన నీటిని నగరంలో గ్రీనరీ కోసం

వినియోగిస్తారు.అయితే ఏపీ ప్రభుత్వం విశాఖ నగరం పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఇప్పటికే పర్యాటకంగా అనేక నిర్మాణాలు చేపట్టింది. మొన్ననే నగరంలో డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించారు చంద్రబాబు. కైలాసగిరిలో దేశంలోనే అతి పెద్ద గాజు

వంతెన ఏర్పాటు చేస్తున్నారు. ఐటీ దిగ్గజ సంస్థలు పెద్ద ఎత్తున విశాఖకు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే వారిని మరింత ఆకర్షించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# 17 మెడికల్ కాలేజీల ఫోటోలతో టీడీపీ ప్రచారం

అనంతపురం సెప్టెంబర్ 10,


ఏపీలో జగన్ కట్టించారని చెబుతున్న మెడికల్ కాలేజీల వీడియోలను టీడీపీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. చాలా కాలేజీలు పునాదుల దశలు దాటలేదు.ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీల అంశం వివాదాస్పదమవుతోంది. ఇటీవల జరిగిన ఏపీమంత్రివర్గ సమావేశంలో పీపీపీ మోడల్‌లో మెడికల్ కాలేజీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంపై వైసీపీ నేతలు వరుసగా విమర్శలు చేశారు. జగన్ కూడా.. తాము సృష్టించిన సంపదను అమ్మేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీల్లో సీట్లుసామాన్యులకు లభించబోవన్నారు. తాము పదిహేడు వరకూ కాలేజీలను కట్టించామని వైసీపీ నేతలు ప్రకటించారు. ఈ ఆరోపణలపై టీడీపీ మండిపడింది. జగన్మోహన్ రెడ్డి కట్టిన మెడికల్ కాలేజీలు ఇవేనంటూ పలు వీడియోలను సోషల్ మీడియాలో పోస్టుచేసింది. బిల్డింగులు ఎక్కడ అయ్యా అని అడిగితే, ఫేక్ సాక్షిలో %ఎఖీశ% గ్రాఫిక్స్ చూపిస్తారు.. ప్రజలని వెర్రి వాళ్ళని చేస్తారు. జగన్ మాయా ప్రపంచంలో కట్టిన 17 మెడికల్ కాలేజీల కథల్లో, ఈ "బాపట్ల మెడికల్ కాలేజీ" మరో మాయ.. జగన్ చేసే ఫేక్‌రాజకీయం ఇదిగో ఇలాగే ఉంటుందని వీడియోను పోస్టు చేశారు. అమలాపురం మెడికల్ కాలేజీ కూడా పునాదులను దాటలేదు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండలో మెడికల్ కాలేజీ పునాదులు కూడా దాటలేదు. ఆదోని మెడికల్ కాలేజీ పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంది. అక్కడ బోర్డు కూడా పాడుబడిపోయింది.మదనపల్లి మెడికల్ కాలేజీ నిర్మాణాలను కూడా టీడీపీ బయట పెట్టింది. దాదాపుగా పదిహేడు మెడికల్ కాలేజీల్లో పరిస్థితులు ఇలా ఉన్నాయని.. తాము కట్టేశామని ప్రచారం చేస్తున్నారని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఈ ఆరోపణలకు వైసీపీ సమాధానం చెప్పాల్సి ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈవీఎంలు

విజయవాడ, సెప్టెంబర్ 10,

ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఈవీఎంలతో నిర్వహించాలన్న ఆలోచనలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహాని ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెడతామని ఆమె తెలిపారు. ప్రబుత్వం అంగీకరిస్తే ఈవీఎంల కొనుగోలుసహా ఇతర లాంఛనాలు పూర్తి చేసే అవకాశం ఉంది. ఇప్పటికే మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈవీఎంలతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయని.. ఎస్ఈసీ నివేదిక సిద్ధం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. మన దేశంలో స్థానిక సంస్థలు(పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్లు 2000ల నుంచి విస్తృతంగా ఉ పయోగిస్తున్నారు. మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్రలోని ఇటీవలి ఎన్నికల్లో కూడా ఈవీఎంలు ఉపయోగించారు. 2024 డిసెంబర్‌లోమధ్యప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈవీఎంలు ,వోటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రెయిల్ ఉపయోగించింది. మొత్తం 23,000కి పైగా గ్రామ పంచాయతీల్లో ఈవీఎంలతో ఎన్నికలు జరిగాయి. 2021సెప్టెంబర్–డిసెంబర్‌లో బీహార్‌లో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 8,000కి పైగా గ్రామ పంచాయతీలు, 534 పంచాయత్ సమితులు, 39 జిల్లా పరిషత్‌లకు ఈవీఎంలు ఉపయోగించారు. 2022 డిసెంబర్‌లో ముంబై,పూణే, నాగ్‌పూర్ వంటి 27 మున్సిపల్ కార్పొరేషన్లు, 26 జిల్లా పరిషత్‌లు, 118 పంచాయత్ సమితులకు ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్లా ఈవీఎంలు వాడారు. అన్ని చోట్ల ఎన్నికలు శాంతియుతంగా జరిగాయి. ఈవీఎంలు సమర్థవంతంగాపనిచేశాయి. వోటింగ్ ప్రక్రియ సజావుగా జరిగి ఓటింగ్ పెరిగిందని అధికారులు తెలిపారు. అయితే అన్ని రాష్ట్రాల్లో ఓడిపోయిన పార్టీలు ఈవీఎంలపై ఆరోపణలు చేశాయి. "ఈవీఎంలలో మానిప్యులేషన్" జరిగిందని ఫలితాలు "రిగ్గింగ్డ్" చేశారనిఆరోపించాయి. ఎన్నికల తర్వాత కొన్ని కేసులు కోర్టుల్లో వేసారు, కానీ %ూజుజ% "ఎలాంటి మానిప్యులేషన్ లేదు" అని తేల్చింది. మూడు రాష్ట్రాల్లో కొన్ని పార్టీలు "ఈవీఎంలలో ఫ్రాడ్" ఆరోపించి, "పేపర్ బాలట్లు" డిమాండ్ చేశాయి. ఎన్నికల తర్వాతకొన్ని ప్రాంతాల్లో రీ–పోలింగ్ జరిగింది. సుప్రీం కోర్టు కూడా %జుజ×%కి ఈవీఎంల భద్రతపై సూచనలు ఇచ్చింది. ఫీడ్‌బ్యాక్ ఎక్కువగా రాజకీయ వివాదాలతో ముడిపడి ఉంది.ఏపీలో ముందస్తుగా మూడు నెలల ముందుగానే ఎన్నికలునిర్వహించాలనుకుంటున్న ఎస్ఈసీ.. ఈవీఎంలు వాడాలంటే అన్నిపార్టీల అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉంటుంది. అయితే రాజకీయ పార్టీలు అంగీకరించడం కష్టమన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈవీఎంలపై వైసీపీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఈక్రమంలో బ్యాలెట్ ఓట్ల ద్వారానే వైసీపీకి బుద్ధి చెప్పాలని టీడీపీ కూడా అనుకుంటోంది. అందుకే ఏపీలో రాజకీయ పార్టీలు స్థానిక ఎన్నికలను బ్యాలెట్ల ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

కూటమిలో టెన్షన్.. టెన్షన్ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియరైంది. దానికి సంబంధించి సర్కార్‌కు పలు సూచనలు ఇచ్చింది రాష్ట్ర ఎన్నికల కమిషన్. మున్సిపల్, పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్స్‌కు సిద్ధం కావాలంటూ%ొ% ఒక షెడ్యూల్‌తో కూడిన వివరాలుఅందజేసింది కమిషన్. వచ్చే ఏడాది జనవరిలోపు మున్సిపాలిటీలకు, ఆ తర్వాత జులైలోపు పంచాయతీలు, జడ్పిటిసి%ొ%.ఎంపిటిసీలకు ఎన్నికలు జరపాలని సూచించింది. దీంతో అధికార యంత్రాంగం కూడా ఆ దిశగా అడుగులు వేయబోతోంది. అదంతాఒక ఎత్తయితే%ొ%. ఎన్నికల సంఘం నిర్ణయం తర్వాత కూటమి పార్టీల్లో కొత్త చర్చ మొదలైందట. మూడు పార్టీల నడుమ ఎంత వరకు సయోధ్య ఉ ందన్న విషయంలో వాళ్ళకే అనుమానాలు ఉన్నట్టు తెలుస్తోది.




నిస్సందేహంగా%ొ% పై స్థాయిలో టీడీపీ,జనసేన, బీజేపీ నాయకత్వాల మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవని, అదే కిందికి వచ్చేసరికి ప్రశ్నార్థకమేనన్న చర్చ నడుస్తోంది పొలిటికల్ సర్కిల్స్‌లో. గ్రామ, మండల స్థాయిలో%ొ%, కొన్ని చోట్లయితే నియోజకవర్గ లెవల్‌లో కూడా మూడు పార్టీల మధ్యఅనైక్యత కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని అంటున్నారు.కూటమి స్థానిక నేతల మధ్య సఖ్యత చాలా తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో%ొ%. లోకల్ బాడీస్ ఎన్నికల్ని ఎలా ఎదుర్కోవాలి, ఓటింగ్ మీద దాని ప్రభావం ఎలా ఉంటుందన్న చర్చ జరుగుతోందటనేతల మధ్య. ఇలాంటి వాతావరణంలో అసలు క్యాడర్ కలిసి పనిచేస్తుందా? వాళ్ళకని వీళ్ళు, వీళ్ళకని వాళ్ళు అలకలు, పంతాలతో మొదటికే మోసం తెస్తారా అన్న ఆందోళన సైతం పెరుగుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి 15నెలలైంది. ఇప్పటివరకు పై స్థాయిలో ఐక్యత బానే ఉన్నా..కింది లెవల్‌లో మాత్రం కొన్ని చోట్ల క్యాడర్, లీడర్స్ రగిలిపోతున్నపరిస్థితి కనిపిస్తోంది. ఇదే ఇప్పుడు ముఖ్య నాయకుల్ని టెన్షన్ పెడుతున్నట్టు తెలుస్తోంది. ఒక పక్క యూరియా కొరత ఆందోళనలు,రైతులు రోడ్డెక్కడం లాంటివి కంగారు పెడుతున్నాయట.ఈ ప్రభావం కూడా స్థానిక ఎన్నికలపై పడుతుందా అన్న అనుమానాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో టీడీపీ జనసేన మధ్య ఐక్యత పై అనేక అనుమానాలు ఉన్నాయంటూ స్వయంగా రెండు పార్టీలముఖ్య నేతల మధ్యనే మాటలు నడుస్తున్నాయట. ప్రధానంగా%ొ%. ఉమ్మడి ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో టీడీపీ జనసేన నేతల మధ్య క్షేత్ర స్థాయిలో సమన్వయం కుదరడం లేదని తెలుస్తోంది.ఇదే పరిస్థితి కంటిన్యూ అయితే స్థానిక ఎన్నికలపైప్రభావం చూపిస్తుందన్న భయాలు పెరుగుతున్నాయట. ప్రభుత్వం భారీ ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా%ొ%.జనంలోకి సరిగ్గా తీసుకు వెళ్లలేకపోతున్నామని, ఎమ్మెల్యేలు కూడా ఈ విషయంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదని ఇటీవల సీఎంచంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఎన్నికలకు వెళ్ళాలి. ఇలా అయితే ఎలాగంటూ%ొ% తాజా క్యాబినెట్ మీటింగ్ తర్వాత సీఎం మంత్రులతో అన్నట్టు సమాచారం. ఎమ్మెల్యేలు, మంత్రులు అలర్ట్‌గా ఉంటేనే%ొ%..కింది స్థాయిలో క్యాడర్ సరిగ్గాఉంటుందని సీఎం అన్నట్టు తెలిసింది. ప్రభుత్వం..ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటన్నిటినీ జనంలోకి తీసుకు వెళ్తేనే స్థానికం లో మాంచి ఫలితాలు వస్తాయని అంటున్నారు మాడు పార్టీల పెద్దలు. అందుకు తగ్గట్టు కింది స్థాయిలో సమన్వయంపెంచేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేయాలనుకుంటున్నారట కూటమి పెద్దలు

# హరీష్ కు రాజకీయ మైలేజ్

మెదక్, సెప్టెంబర్ 10,

పడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదు.. పండ్లు ఉన్న చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయి.. ఆ విషయం మరోసారి నిరూపితమైంది. బీఆర్ఎస్ కు నడిపించేది కేసీఆర్.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తండ్రిని, సోదరుడిని ఏమీ అనలేక మధ్యలో ఏ సంబంధం లేని హరీష్, సంతోష్ లను తన రాజకీయ చట్రంలో బంధించి బలి చేయాలనుకుంది కల్వకుంట్ల కవిత.. కానీ నీళ్లు ఏవో, పాలు ఏవో జనాలకు తెలుసు. అందుకే ఇప్పుడు జనాల్లో , సోషల్ మీడియాలో కవిత పలుచన అయిపోయింది.. హరీష్ రావుపై సానుభూతి పొంగిపొర్లుతోంది.బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు కొత్త దిశలోకి మళ్లుతున్నాయి. ముఖ్యంగా కల్వకుంట్ల కవితపై సస్పెన్షన్ తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఊహించని మలుపు తిప్పాయి. హరీష్ రావుపై ఆమె చేసిన ఆరోపణలు బూమరాంగ్ అయి, ఆయనకే అనుకూలంగా మారిన తీరు గమనించదగ్గది.హరీష్ రావు రాష్ట్రంలోనే కాకుండా, తన నియోజకవర్గంలోనూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే 'ట్రబుల్ షూటర్'గా స్థిరమైన ఇమేజ్ సంపాదించుకున్నారు. పంట నష్టాలు, ఉద్యోగ సమస్యలు, ఆరోగ్య సమస్యలు ఏవైనా ఆయన ముందుండి పరిష్కరించే తీరు ప్రజల విశ్వాసాన్ని బలపరిచింది. అలాంటి నాయకుడిపై ఆరోపణలు వచ్చినా ప్రజలు వాటిని నమ్మలేకపోయారు. ఈ నమ్మకం ఇప్పుడు హరీష్‌కు అతి పెద్ద బలంగా మారింది.కవిత చేసిన ఆరోపణలు కొత్తవి కావు. ఇంతకుముందు కూడా ఇలాంటివే వినిపించాయి. అందువల్ల ప్రజల దృష్టిలో ఇవి కొత్త వెలుగులు చూపించలేదు. అసలైన ప్రజా సమస్యలతో సంబంధం లేకుండా వ్యక్తిగత కక్షతో చేసిన వ్యాఖ్యలుగా ప్రజలు భావించడం వల్ల, అవి ప్రభావం చూపలేదు.ప్రజలు హరీష్ రావుకు సానుభూతి చూపడం వలన కవితకే నష్టం కలిగింది. "హరీష్ రావును ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?" అనే ప్రశ్న ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఫలితంగా కవితపై నమ్మకం తగ్గిపోగా, ఆమె రాజకీయంగా రక్షణాత్మక స్థితిలోకి వెళ్లిపోయారు.కవిత వ్యాఖ్యల తర్వాత హరీష్ రావు మరింత ప్రజా మద్దతు పొందారు. ఆయన పట్ల ఇప్పటికే ఉన్న సానుకూల దృక్పథం మరింత బలపడింది. రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నట్టుగా, ఈ సానుభూతి భవిష్యత్తులో ఆయనకు మరింత రాజకీయ బలం చేకూర్చే అవకాశం ఉంది.

# డ్వాక్రా మహిళలకు బంగారు అవకాశం



గుంటూరు, సెప్టెంబర్ 10,

డ్వాక్రా మహిళలకు మంచి ఛాన్స్.. సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చు. అందుకు కావాల్సిన రుణాలను బ్యాంక్ లింకేజీ రుణాలుగా అందిస్తారు. లేదా స్త్రీ నిధి, ఉన్నతి పథకంలో కేటాయిస్తారు. అయితేం ఇది అందరికీ కాదండోయ్. గుంటూరు జిల్లాలోనిస్వయం సహాయక సంఘాల మహిళలకు మాత్రమే. డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డీఆర్‌డీఏ వారితో కొరమీను పెంపకం యూనిట్లు ఏర్పాటు చేయించాలనే ఆలోచనలో ఉంది. త్వరలోనే యూనిట్లు కూడా ఏర్పాటుకానున్నాయిమహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా, ఆర్థికంగా సొంత కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో కొత్త పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఈక్రమంలోనే స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉండే మహిళలకు రాయితీ రుణాలు, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తూ అండగా నిలుస్తోంది ప్రభుత్వం. ఈ క్రమంలోనే ఏపీలోని డీఆర్‌డీఏ స్వయంసహాయక సంఘాలలోని మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఓ కొత్త ప్రణాళిక రూపొందించింది. అదే కొరమీనుల పెంపకం. డ్వాక్రా సంఘాల మహిళలకు కొరమీనుల పెంపకం యూనిట్లను కేటాయించి ఉపాధి కల్పించే ఆలోచన చేస్తోంది.ఇందులో భాగంగాగుంటూరు జిల్లాలో కొరమీనుల పెంపకం యూనిట్లను డీఆర్‌డీఏ ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించాలని భావిస్తోంది. సెప్టెంబర్ రెండో తేదీన గుంటూరు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్,అనుబంధ శాఖల అధికారులను డీఆర్‌డీఏతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే కొరమీను పెంపకం యూనిట్ల ప్రతిపాదనను మత్స్యశాఖ అధికారులు చేశారు. అందులో భాగంగా మొదటి దశలో.. గుంటూరు నగరం, పొన్నూరు, తెనాలిలోనిడ్వాక్రా సంఘాల మహిళలకు కొరమీను పెంపకం యూనిట్లు కేటాయిస్తారు.రెండో దశలో మంగళగిరి, తాడేపల్లిలో ఏర్పాటు చేస్తారు. డ్వాక్రా సంఘాల సభ్యులుగా ఉండి, ఆసక్తి కలిగిన మహిళలకు డీఆర్డీఏ, వెలుగు అధికారులు కొరమీను పెంపకం యూనిట్లఏర్పాటులో సహకారం అందిస్తారు. ఒక్కో యూనిట్ కోసం రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షలు ఖర్చు కానుంది. ఇందుకోసం స్త్రీనిధి, ఉన్నతి పథకం ద్వారా రుణాలు అందిస్తారు.అలాగే బ్యాంక్ లింకేజీ రుణాలు కూడా సమకూర్చుతారు. అలాగే అధికారులేమహిళలకు కొరమీను చేప పిల్లలను అందిస్తారు. సెంట్ నుంచి పది సెంట్ల స్థలంలో ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. యూనిట్ల ఏర్పాటు కోసం డీఆర్డీఏ, మత్స్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొరమీను పెంపకం యూనిట్ల ఏర్పాటుద్వారా మహిళలకు ఆర్థిక భరోసా ఇవ్వాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

# పండుగ బూస్టర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10

జీఎస్టీ సంస్కరణల కోసం తీసుకున్న నిర్ణయాల సమయంలో భారత ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహకంగా మారే ఓ వార్త వచ్చింది. పండుగల సీజన్ అంటే రాబోయే 3 నెలల్లో సెప్టెంబర్ నుండి నవంబర్ మధ్య దేశంలోని పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు దాదాపు 2.19లక్షల కోట్లు (సుమారు 24.8 బిలియన్ డాలర్లు) ఖర్చు చేయబోతున్నారు. లోకల్ సర్కిల్స్ సర్వే నివేదిక ప్రకారం.. గత సంవత్సరం కంటే ఈ సంఖ్య దాదాపు 18 శాతం ఎక్కువ. గత ఏడాది ఇదే సమయంలో పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు రూ.1.85లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. అంటే ఈసారి అదే సమయంలో ప్రజలు దాదాపు రూ.73000 కోట్లు ఎక్కువ ఖర్చు చేయనున్నారని సమాచారం.సర్వే సమయంలో దేశవ్యాప్తంగా 319 జిల్లాలను కవర్ చేశారు. దాదాపు 44 వేల ఇళ్లలోని 2 లక్షలమంది ప్రజలను అడిగి అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సర్వేలో దాదాపు మూడింట ఒక వంతు మంది పురుషులు, ఐదుగురిలో ఇద్దరు మహిళలు తమ అభిప్రాయాలను షేర్ చేసుకున్నారు. ఇందులో టైర్-1, టైర్-2 నగరాల నుండి 70 శాతం మందిని కొత్తగా చేర్చగా, మిగిలిన వారు టైర్-3, టైర్-4కి చెందిన వారు ఉన్నారు. వీరందరి మొత్తం సగటు అంచనా వ్యయం దేశంలోని పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు, వారి సగటు ఖర్చు నమూనాల ఆధారంగా లెక్కించారు.దాదాపు 15 శాతం మంది తమ చేస్తున్న ఖర్చు రూ.50 వేల నుండి రూ.1 లక్ష వరకు ఉండవచ్చని సూచించారు. అయితే 25 శాతం మంది రాబోయే 3 నెలల్లో పండుగల సీజన్‌లో రూ.20 వేల నుంచి 50 వేల రూపాయల వరకు ఖర్చు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా,పండుగల సీజన్‌లో ఖర్చు పెరగడానికి కారణం పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలు దాదాపు రూ.20 వేలకు పైగా ఏదో రూపంలో ఖర్చు చేయాలని ప్లాన్ చేయడమే కారణమని నివేదిక పేర్కొంది. ఇది గత సంవత్సరం కంటే దాదాపు 11 శాతం ఎక్కువ అని నివేదికలు చెబుతున్నాయి.పండుగల సీజన్ లో ఖర్చు పెరగడానికి ఆదాయం పెరగడం, అదే సమయంలో ఈ-కామర్స్ అమ్మకాలు పెరగడమే కారణమని నివేదికలో వెల్లడైంది. ఈ సంవత్సరం రక్షాబంధన్ లో ప్రజలు చేసిన ఖర్చు కూడా గత సంవత్సరంకంటే 75 శాతం ఎక్కువ. గత సంవత్సరం రూ.12000 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 2025లో రూ.21000 కోట్లకు పెరిగిందని సర్వేలో పేర్కొన్నారు.




# ఉల్లి రైతులకు ఊరట...

కర్నూలు, సెప్టెంబర్ 10,

ఉల్లి ధరలు.. రైతులను కన్నీరు పెట్టిస్తోంది. ఏపీలో ఉల్లి ధర పాతాళానికి పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎకరా సాకుకోసం లక్ష రూపాయలకుపైగా ఖర్చు పెట్టినా.. అందులో 20 శాతం కూడా తిరిగి రాలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం కిలో ఉల్లి 6 రూపాయలు, ఇంకొన్ని చోట్ల 2 రూపాయలే పలకటంతో .. కనీసం కూలీల ఖర్చులూ రావడం లేదంటూ రైతులు వాపోతున్నారు..మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న ఉల్లి రైతులను ఆదుకునేందుకు ఏపీ ప్రభుత్వంచర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా క్వింటాల్ ఉల్లిని రూ.1200 చొప్పున కొనుగోలు చేయించాలని నిర్ణయించింది. ఒక వేళ వ్యాపారులు ఆ మొత్తం చెల్లించకపోతే, మిగతా మొత్తాన్ని రైతులకు ప్రభుత్వమే చెల్లించనుంది. ఇందుకోసం ధరల స్థిరీకరణనిధి నుంచి రూ.10 కోట్లు మార్క్ ఫెడ్‌కు విడుదల చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఉల్లి రైతులకు ఊరట కలిగించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఉల్లికి సరైన ధర లేక.. రైతన్నలు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఉల్లిని కొనడానికివ్యాపారులు ముందుకు రాకపోవటంతో మార్కెట్లోనే వదిలేసిన రైతులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉల్లి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ఉల్లి రైతులకు ఉపశమనం కల్పించేలా సీఎం నారా చంద్రబాబునాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. క్వింటా ఉల్లికి రూ.1200 చొప్పన మద్దతు ధర చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇందుకోసం అడ్వాన్సుగా రూ.10 కోట్ల నిధులు కూడా ఏపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఆర్థికసంవత్సరానికి సంబంధించిన ధరల స్థిరీకరణ నిధి నుంచి రూ.10 కోట్లు మార్క్ ఫెడ్‌కు అడ్వాన్సుగా విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి పంటను కొనుగోలు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకిజిల్లా కలెక్టర్‌ను అధ్యక్షుడిగా నియమించింది. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి క్వింటా రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేయించనున్నారు. ఒకవేళ వ్యాపారులు అంతకంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే.., ఆ మొత్తాన్నిప్రభుత్వమే భరిస్తుంది. వ్యాపారులు, మార్క్‌ఫెడ్ కలిసి కొనుగోలు చేసేలా శనివారం నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేస్తున్నారు. అయితే ఇక్కడ కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త విధానంలో తొలుతరైతుల నుంచి ఉల్లిని వ్యాపారులు ఓ ధరను కొంటారు. అయితే ఆ ధర మార్క్ ఫెడ్ నిర్ణయించిన ధర కంటే తక్కువగా ఉంటే.. ఆ మొత్తాన్ని రైతులకు మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే వ్యాపారులు ఎప్పుడు పంటను కొంటారనేదీ క్లారిటీలేకపోవటంతో మార్కెట్ యార్డులో రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది.ఒకవేళ కొనుగోలు చేసినప్పటికీ.. ఆ సరుకు మార్కెట్ దాటించేవరకూ రైతులే బాధ్యత తీసుకోవాలని వ్యాపారులు చెప్తున్నారు. దీంతో పంటను అమ్ముకున్న తర్వాత కూడా ఉల్లి రైతులకుమార్కెట్ యార్డులో పడిగాపులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో సకాలంలో ఉల్లిని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.వేగంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు ఉల్లి రైతులకు నష్టంకలగకుండా చర్యలు తీసుకుంటామంటున్న ప్రభుత్వం.. ఉల్లి రైతుల కోసం కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో ఉంచుతామని చెప్తోంది. అలాగే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లకు తరలించాలని ఆలోచనలు చేస్తోంది.



# పార్టీ మారిన వారికి వద్దే..వద్దు

కాకినాడ, సెప్టెంబర్ 10,


ఏ రాజకీయ పార్టీ కైనా క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలు ముఖ్యం. వారిని విస్మరిస్తే మూల్యం ఏ స్థాయిలో ఉంటుందో మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చవిచూసింది. ఓవైపు వాలంటీర్లు, మరోవైపు సచివాలయాలు, ఇంకోవైపు ఐపాక్, ఆపై సోషల్ మీడియా.. వీటినే నమ్ముకున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ క్షేత్రస్థాయిలో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను విడిచిపెట్టారు. దాని మూల్యం చెల్లించుకున్నారు మొన్నటి ఎన్నికల్లో. అయితే అదే తప్పిదం వద్దని ఏపీ సీఎం చంద్రబాబును కోరుతున్నారు కూటమి పార్టీల శ్రేణులు. ముఖ్యంగా టిడిపి శ్రేణులు అయితే.. తొలి ప్రాధాన్యం తమకే ఇవ్వాలని కోరుతున్నారు. మలి ప్రాధాన్యం కూటమి శ్రేణులకు ఇవ్వాలని సూచిస్తున్నారు. బయట పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తేజగన్మోహన్ రెడ్డికి పట్టిన గతి తప్పదని హెచ్చరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు అగ్ర తాంబూలం ఇవ్వాలని కోరుతున్నారు.వచ్చే ఏడాది సంక్రాంతి తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్రఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఈ తరుణంలో అన్ని పార్టీల్లో ఆశావహుల సందడి ప్రారంభం అయ్యింది. ఎవరికి వారే ప్రయత్నాలు మొదలుపెట్టారు కూడా. అయితే చాలామంది ఇతర పార్టీల నుంచి టిడిపిలో చేరిన వారు అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే పొత్తులో భాగంగా మూడు పార్టీల నేతలు పదవులు కోరుకుంటున్నారు. ఇప్పుడు ఎన్నికల అనంతరం చాలామంది నేతలు టిడిపిలో చేరారు. జనసేనతో పాటు బిజెపిలో చేరిన వారు కూడా ఉన్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత.. ఎన్నికలకు ముందు వైసీపీ ఓటమి ఊహించి వచ్చిన వారికి.. స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం ఇస్తే మాత్రం ఊరుకునేది లేదని టిడిపి నేతలు హెచ్చరిస్తున్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి.. పార్టీ జెండా పట్టి తిరిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. అలా జరగకుంటే పార్టీకి నష్టం తప్పదని ఇప్పటినుంచే హెచ్చరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభమయ్యాయని తెలిసిన నాటి నుంచి.. సోషల్ మీడియా వేదికగా టిడిపి నేతలు సొంత పార్టీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. అటు తరువాత కూటమి పార్టీలకు ప్రయారిటీ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థలకు సంబంధించి ఏకగ్రీవాలు జరిగాయి. చివరకు జడ్పిటిసిలను సైతం ఏకగ్రీవం చేసుకున్నారు. అయితే అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు.. పార్టీకి ఎన్నికల్లో బాగా మైనస్ చేసింది. అప్పట్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అప్పటి ఎమ్మెల్యేలు ప్రాధాన్యమిచ్చారు. తమకంటూ ఒక సొంత వర్గం తయారు చేసుకోవాలన్న ఆలోచనలో అప్పట్లో అలా చేశారు. దీంతో నిజంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికి ఇది రుచించలేదు. అప్పటికే వాలంటీర్ సిస్టంతో వైసీపీ నాయకులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కకపోవడంతో ఆవేదనతో ఉండేవారు. దీనికి తోడు స్థానిక సంస్థల్లో తమకు అవకాశం దక్కుతుందని భావించారు. కానీ అప్పటివరకు ఇతర పార్టీల్లో ఉన్నవారు వైసీపీలో చేరి అవకాశాలను ఎగురేసుకుపోయారు. దీంతో తీవ్ర నైరాస్యంలో కూరుకుపోయారు వైసీపీ శ్రేణులు. ఆ ప్రభావం సార్వత్రిక ఎన్నికల్లో కనిపించింది. పార్టీ దారుణ పరాజయానికి కారణం అయింది. ఎన్నికలకు ముందు చాలామంది వైసిపి నేతలు టిడిపిలోకి వచ్చారు. జనసేనలో ఎక్కువ శాతం వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం చేరింది. అయితే ఫలితాలు వచ్చిన తర్వాత సైతం చాలామంది ఈ మూడు పార్టీల్లో చేరారు. కేసుల భయంతో కొందరు.. అవినీతి కేసులు ఎదురవుతాయని మరికొందరు.. ఇబ్బందికర పరిస్థితులను అధిగమించేందుకు ఇంకొందరు.. ఇలా చాలామంది చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన రావడంతో వారంతా ఇప్పుడు పదవుల కోసం సిద్ధపడుతున్నారు. దీంతో ఎప్పటినుంచో పార్టీ కోసం కష్టపడుతున్న వారు ఇప్పుడు ఆందోళనకు గురవుతున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీతో సుదీర్ఘకాలం ప్రయాణం చేసిన వారికి మాత్రమే అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి నారా లోకేష్ దృష్టి పెట్టాలని సోషల్ మీడియా వేదికగా చాలామంది విజ్ఞప్తి చేస్తుండడం విశేషం. మరి వీరి విన్నపాలను హై కమాండ్ పరిగణలోకి తీసుకుంటుందో? లేదో? చూడాలి.



# ఉద్యోగాల జాతర...

రాజమండ్రి, సెప్టెంబర్ 10,

ఏపీకి భారీగా పరిశ్రమలు వస్తున్నాయి. పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏపీని కేంద్రంగా చేసుకొని పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. ఈనేపథ్యంలో ఏపీలో మరో భారీ పెట్టుబడికి లైన్ క్లియర్ అయ్యింది. ఏకంగా రూ.70 వేల కోట్లతో ఓ పరిశ్రమ రాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి లో మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పై కేంద్రమంత్రి కీలక ప్రకటన చేశారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ఫ్యాక్టరీకి అవసరమైన అన్ని అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు




చేశాయని చెప్పారు. ఢిల్లీలో జరిగిన ఉక్కు సదస్సులో ఈ కీలకప్రకటన చేశారు కేంద్ర సహాయ మంత్రి. ఫ్యాక్టరీ ఏర్పాటు పై ఫుల్ క్లారిటీ ఇచ్చారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో అర్సెలార్ మిట్టల్, నెప్పం స్టీల్స్ కలిపి భారీ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి. రూ. 1.47 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్నాయి.మొదటి దశలో రూ.70 వేల కోట్లతో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయనున్నారు. ముడి ఖనిజం సరఫరా కోసం ఎన్ఎండిసి తో ఒప్పందం కుదిరింది. నక్కపల్లి మండలం రాజయ్యపేట దగ్గర 2200 ఎకరాల భూమిని కర్మగారం కోసంకేటాయించారు. ప్లాంట్ నిర్మాణం మొదటి దశలో 20 వేల మందికి ఉపాధి లభించనుంది. రెండో దశలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 10.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచనున్నారు. 60 :40 నిష్పత్తితో ఆ రెండు స్టీల్ సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. మొదటి దశలో భాగంగా నాలుగేళ్లలో 70 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రతిపాదించారు. 2029 జనవరి నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.రెండో దశలో రూ.80,000 కోట్ల వరకు పనులు చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 203 నాటికి పనులు పూర్తి చేయాలని.. తద్వారా మరో 35 వేల మందికి ఉపాధి దక్కుతుందని అంచనా వేస్తున్నారు. 2035 నాటికి నాలుగు వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్రమంత్రి ప్రకటనతో త్వరలో శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. ఈ స్టీల్ ఫ్యాక్టరీకి అనుసంధానంగా పోర్టును కూడా అభివృద్ధి చేయనున్నారు. తద్వారా స్టీల్ ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు వీలుంటుంది. దాదాపు రూ.6000 కోట్ల రూపాయలతో ఈ పోర్టు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పోర్టు నిర్మాణానికి 150 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పూర్తయిన వెంటనే మరో పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీనికోసం సైతం 170 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. దాదాపు 12 బెర్త్ లతో పోర్టు నిర్మాణం జరగనుంది. ఈ పోర్టుల నిర్మాణం ద్వారా కూడా పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగే ఛాన్స్ ఉంది.

# రోల్ మోడల్ గా రేవంత్ ఇంటి గోడను కూల్చేయమని ఆదేశం

మహబూబ్ నగర్, సెప్టెంబర్ 10,

కొన్ని విషయాలలో రేవంత్ తీరు అందరికీ నచ్చకపోవచ్చు. ముఖ్యంగా కేసీఆర్ మీద మాట్లాడే మాటలు.. చేసే విమర్శలు ఇతరులకు ఇబ్బందికరంగా ఉండవచ్చు. కొన్ని విషయాలలో మాత్రం అతడు చేసే పనులు గొప్పగా ఉంటున్నాయి. అలాంటివి ప్రజాస్వామ్యం మీద కొంతలో కొంత నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. వాస్తవానికి ఒక నాయకుడిని బలంగా నిలబెట్టేవి.. జనాలలో బలంగా ప్రొజెక్ట్ చేసేవి ఇవే. కొన్ని మీడియా సంస్థలు ఇలాంటి వాటిని పట్టించుకోకపోయినప్పటికీ.. అప్పుడప్పుడు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇలాంటి విషయాలను బయటపెడుతోంది. సరిగ్గా కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం బయటపెట్టిన వీడియో ద్వారా ఇది వెలుగులోకి వచ్చింది.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొండారెడ్డిపల్లి. ప్రస్తుతం ఆ గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు ముఖ్యమంత్రి ఇంటి చుట్టూ ఉన్న రక్షణ గోడ ప్రధాన అడ్డంకిగా మారింది. వాస్తవానికి ముఖ్యమంత్రి ఆ గోడను తొలగించడానికి ఒప్పుకోరని.. పనులు ఆగిపోతాయని ఓ పార్టీ అనుకూల మీడియా తెగ ప్రచారం చేసింది. కానీ ఆ ప్రచారానికి భిన్నంగా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు.. తన ఇంటి రక్షణ కూడా తొలగించడానికి ఆయన అనుమతి ఇచ్చారు. తద్వారా రోడ్డు పనులు ఆగిపోకుండా చూశారు.. దీంతో ముఖ్యమంత్రి ఇంటి చుట్టూ ఉన్న రక్షణ కూడాను తొలగించారు. దీంతో పనులు జరిగిపోతున్నాయి. రోడ్డు విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజల ఇబ్బందులు కూడా తీరబోతున్నాయి.కౌన్సిలర్ అయితేనే రకరకాలుగా హంగామా చేసే రోజులు ఇవి . తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇష్టానుసారంగా ప్రవర్తించే దినాలు కూడా ఇవే. అయినప్పటికీ ముఖ్యమంత్రి తన హోదాను ఇక్కడ ఉపయోగించలేదు. పైగా ఒక సామాన్య మనిషిలాగా రోడ్డు విస్తరణకు ఒప్పుకున్నారు. తన ఇంటి స్థలం పోతున్నప్పటికీ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పనులు జరిగేలా చేశారు. పనులకు సహకరించిన ముఖ్యమంత్రి కి కొండారెడ్డిపల్లి ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు." మా బాధను ముఖ్యమంత్రి అర్థం చేసుకున్నారు. అందువల్లే ఆయన ఇంటి స్థలం పోతున్నప్పటికీ పట్టించుకోలేదు. పైగా మా ప్రయోజనాల కోసం ఆయన త్యాగం చేశారు. ఆయన చూపించిన తెగువ ఎప్పటికీ మర్చిపోలేమని" కొండారెడ్డిపల్లి ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం అయిన కొండారెడ్డిపల్లిలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అధికారులు సీఎం ఇంటి కాంపౌండ్‌ను కూల్చారు.

# కంటిలో నలుసులా రాజగోపాలరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10

తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంపై కొంత కాలంగాధిక్కార స్వరం వినిపిస్తున్నారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. తనకు మంత్రి పదవి విషయంలో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడంలేదన్న అభిప్రాయంతో ఉన్నారట ఈ హస్తం సీనియర్ నేత. దాంతో స్వరం పెంచుతున్నట్టు తెలుస్తోంది. ఆలస్యం అయినా ఫర్వాలేదు మంత్రి పదవి వస్తుందివేచి చూసే ఓపిక నాకుందని ఓవైపు అంటూనే సమయం, సందర్భం వచ్చినప్పుడు ఏ మాత్రం వదలకుండా రాష్ట్ర నాయకత్వంపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉన్నారాయన. ఈ క్రమంలోనే. తాజాగా రీజినల్ రింగ్ రోడ్డు భూ బాధితులతో సమావేశమైన రాజగోపాల్ రెడ్డి%ౌ% ఆ సమావేశంలో చేసిన కామెంట్స్ కాకరేపుతున్నాయి. తన ధిక్కారాన్ని మరో రూపంలోకి



మార్చి పోరుబాట ఎంచుకోవడం చర్చనీయాంశం అవుతోంది. అధికార పార్టీలో ఉండి కూడాప్రభుత్వం మీద పోరాటం కోసం రూట్ మార్చి టాప్ గేర్ వేశారా అనే చర్చ జరుగుతోంది కాంగ్రెస్ పార్టీలో. త్రిబుల్ ఆర్ దక్షిణ భాగం భూ భాదితుల కోసం ఎంతటి త్యాగానికైనా వెనకాడబోనంటూ గతంలో తన రాజీనామా ఎపిసోడ్‌ని గుర్తు చేస్తున్నారాయన. వ్యక్తిగతంగా నాకు అన్యాయం జరిగినా ఫర్వాలేదుగానీ మునుగోడు నియోజకవర్గ ప్రజలకు జరిగితే మాత్రం ఊరుకోను, ఎంతటి త్యాగానికైనా వెనుకాడబోను, రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు ఎమ్మెల్యే.తన నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరిగే తాజా అలైన్‌మెంట్‌ను మునుగోడు ఎమ్మెల్యేగా ఎట్టి పరిస్థితుల్లో తాను ఒప్పుకునేది లేదని తేల్చిచెప్తున్నారు రాజగోపాల్‌రెడ్డి. అసలు మొత్తం దక్షిణభాగం అలైన్ మెంట్‌ని మార్చాల్సిందేనన్నది ఆయన లేటెస్ట్ డిమాండ్. అసలు ఎవరిని అడిగి దాన్ని ఆమోదించారని ప్రశ్నిస్తున్నారాయన. స్థానిక రైతుల అభిప్రాయం తీసుకోలేదని, కనీసం దక్షిణ భాగం ఎమ్మెల్యేలతోనైనా ప్రభుత్వ పెద్దలు మాట్లాడారా అంటూ ఘాటుగా రియాక్ట్ అవుతున్నారు రాజగోపాల్‌రెడ్డి. వ్యవస్థను స్తంభింపజేస్తేనే అలైన్ మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దిగి వస్తుందని, రైతులకు న్యాయం జరుగుతుందని అనడం ద్వారా తన రూట్ ఏంటో చెప్పకనే చెబుతున్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఆయన వ్యాఖ్యలు భూ బాధితుల్లో ఉత్సాహం నింపుతుండగాహస్తం పార్టీలో మాత్రం కొత్త పంచాయితీకి తెర లేస్తోందన్న అభిప్రాయం బలపడుతోంది. అధికార పార్టీలో ఉండికూడా రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా, భూ బాధితులకు మద్దతుగా రాజగోపాల్ రెడ్డి అండగా నిలబడటం ఒక ఎత్తైతే ఆయన తీసుకున్న స్టాండ్ ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది రాజకీయవర్గాల్లో.ఇది ఒక్క మునుగోడు నియోజకవర్గంతోనే ఆగిపోదని అంటున్నారు అనేక చోట్ల అలైన్ మెంట్ లు మార్చాలని, పరిహారం పెంచాలనే డిమాండ్స్ ఉన్న క్రమంలో తాజాగా రాజగోపాల్ రెడ్డి దూకుడు ఇటు సొంత పార్టీకి ఇరకాటం కావడంతో పాటు అటు ప్రతిపక్షానికి అస్త్రం అవుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది కాంగ్రెస్ వర్గాల్లో. పైగా%ౌ% త్రిబులార్ భూ బాధితుల ప్రభుత్వాన్ని స్తంభింపచేయడానికి సిద్ధంగా ఉండాలి, ఎప్పుడు పిలుపునిచ్చినా వేల సంఖ్యలో తరలిరావాలంటూ ఆయన చేసిన కామెంట్స్ మరింత కాకరేపుతున్నాయి. భూ బాధితులతో రాజగోపాల్ రెడ్డి వరసగా మీటింగ్స్ పెడుతుండటంతో రాజు కంటే మొండోడు బలవంతుడన్న సామెతను గుర్తు చేసుకుంటున్నారు జిల్లా వాసులు. ఈ పరిస్థితుల్లో మునుగోడు ఎమ్మెల్యేని కాంగ్రెస్ పెద్దలు ఎలా డీల్ చేస్తారోనన్నది ఆసక్తికరంగా మారింది.

# ముత్యాలమ్మ ఆలయం దగ్ధం వందలాదిమంది భక్తుల ఆందోళన

పశ్చిమగోదావరి సెప్టెంబర్ 10

మొగల్తూరు లో ముత్యాలమ్మ ఆలయం దగ్ధం పై విశ్వహిందూ పరిషత్,ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు పిలుపు ఇవ్వటంతో అమ్మవారి గుడి సమీపంలోకి వందలాదిమంది భక్తులు ఆందోళన చేపట్టారు. ఆలయాన్ని దగ్ధం చేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు ఆలయ ప్రాంగణం అంతా శ్రీ రామ నామస్మరణంతో మార్మోగింది. ఐదు రోజులలో దోషలను అరెస్ట్ చేయాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక చేశారు హిందూ దేవాలయాలు పై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు చేయాలాంటు వందలాది భక్తులతో భారీ ర్యాలీగా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టేషన్ చుట్టూ భారీగా పోలీసులును మోహరించారు

అనంతరం డిఎస్పి శ్రీ వేదకు ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ నాయకులు వినతి పత్రం అందజేస్తూ హిందూ దేవాలయంలో కాపాడాలని జరిగిన సంఘటనకు బాధ్యులను ఐదు రోజుల్లో పట్టుకుని శిక్షించాలని లేదంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ నాయకులు అన్నారు

# జగన్ పై దృష్టి పెట్టిన కాంగ్రెస్

విజయవాడ, సెప్టెంబర్ 10

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెల్ఫ్ గోల్ వేసుకున్నట్లు కనిపిస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తటస్థంగా ఉండాల్సింది పోయి ఏరి కోరి కష్టాలు తెచ్చుకుంది. బిజెపి అడిగిందే



తడువుగా ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎదురెళ్లిసహకరించింది. అయితే ఇప్పుడు ఎన్డీఏ నుంచి ఏ విధమైన సహకారం అందుతుందా? అన్నది చర్చకు దారితీస్తోంది. కానీ కేసులకు భయపడి రాజీ పడిపోయారని జగన్ పై కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడుతోంది. అయితే ప్రధానంగా బిజెపిని వ్యతిరేకించే ప్రతిపార్టీకి ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శత్రువుగా మారింది. వాస్తవానికి తటస్థంగా ఉంటామంటే బిజెపి సైతం జగన్ విషయంలో ఉదాసీనంగా ఉండేది. కానీ జగన్ మాత్రం ఎన్డీఏ అభ్యర్థికి సహకరించి.. దేశవ్యాప్తంగా ఉన్న బిజెపి వ్యతిరేక పార్టీలకు ప్రత్యర్థికిమించి శత్రువు అయ్యారుముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి పై తీవ్ర ఆగ్రహంతో ఉంది. గతంలో ఏపీలో ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీని దారుణంగా దెబ్బతీశారు జగన్. తద్వారా జాతీయస్థాయిలో సైతం తెలుగు రాజకీయ ప్రభావం కాంగ్రెస్‌పార్టీ పై పడింది. కాంగ్రెస్ పార్టీ వైయస్ కుటుంబానికి ఎనలేని ప్రాధాన్యమిస్తే.. జగన్మోహన్ రెడ్డి దారుణంగా తమను వంచించారని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఆగ్రహించింది. అయితే ఏపీలో జగన్మోహన్ రెడ్డి ఓడిపోయిన తర్వాత.. చంద్రబాబు ఎన్డీఏకు కీలకభాగస్వామిగా మారిన తర్వాత.. జగన్ విషయంలో కాంగ్రెస్ పార్టీలో కొంత సానుకూల వైఖరి కనిపించింది. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడే సూచనలు కనిపిస్తుండగా.. ఏపీలో జగన్మోహన్ రెడ్డిని చేరతీయడం ద్వారా పూర్వ వైభవం పొందవచ్చు అనికాంగ్రెస్ ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం నడిచింది. అయితే చేజేతులా ఆ అవకాశాన్ని జారవిడుచుకున్నారు జగన్మోహన్ రెడ్డి.ప్రతి పది, 15 సంవత్సరాలకు పొలిటికల్ ట్రెండ మారుతుంది. ఈ విషయంలో ఎవరు అతీతం కాదు. ఈ డిజిటల్ యుగంలో మనిషిఆలోచనలు శరవేగంగా మారుతున్నాయి. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2014 వరకు ఆ పార్టీయే కేంద్రంలో అధికారంలో ఉంది. సంక్లిష్ట పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా మరోసారి తన పూర్వవైభవాన్నిచాటుకుంది. 2014లో మోడీ నేతృత్వంలోని బిజెపి హవా ప్రారంభం అయింది. 2019లో అయితే ఎవరి సాయం అక్కర్లేకుండా అధికారంలోకి వచ్చింది. 2024లో మాత్రం మెజారిటీకి దూరంగా నిలిచిపోయింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ బలపడినట్లుకనిపిస్తోంది. అంతకుమించి బిజెపి వ్యతిరేక పార్టీలో కసి వ్యక్తం అవుతోంది. తద్వారా బిజెపిని గద్దె దించాలన్న ప్రయత్నాలు చాలా జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డి ఎలా ఉండాలి. ఏ కూటమితో ప్రమేయం లేకుండా తటస్థంగా నైనాఉండాలి. లేకుంటే ఇండియా కూటమికి జై కొట్టాలి.జగన్మోహన్ రెడ్డి ఎన్డీఏ(కూటమి అభ్యర్థికి మద్దతు తెలిపారు. ఆయన గెలుస్తారు. కానీ జగన్మోహన్ రెడ్డికి వచ్చే ప్రయోజనం ఏంటి? అంటే కేవలం కేసుల ఉపశమనం. ఇప్పుడు దానినే హైలెట్ చేస్తోందికాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు ఉన్న అపవాదులు చాలవన్నట్టు.. కాంగ్రెస్ పార్టీ అదే పనిగా ప్రచారం చేస్తోంది. జగన్ వెన్నెముక లేని నాయకుడిగా అభివర్ణిస్తోంది. కేసుల గురించి బిజెపికి సరెండర్ అయ్యారని.. చరిత్ర మిమ్మల్ని క్షమించదు అంటూ.. కాంగ్రెస్ పార్టీఏపీ ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్ తీవ్ర విమర్శలు చేశారు. జగన్ సిబిఐ కేసులకు భయపడే ఎన్డీఏకు మద్దతు ఇచ్చారని ఆరోపించారు. ఇది ఏపీ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని.. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే జగన్ ఇలా చేశారని అన్నారు. ఇదేవిషయంపై సంచలన ట్విట్ చేశారు మాణిక్కం ఠాగూర్. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక తర్వాత జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఉతికి ఆరేయనుంది. మరోవైపు జాతీయ స్థాయిలో సైతం ఇతర పార్టీల మద్దతు జగన్కు దక్కేఅవకాశం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల భయం కూడా అదే.

# భారత్ నుంచి ఇజ్రాయెల్ నేర్చుకోవాల్సింది ఇదే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10,

ఇజ్రాయెల్%-%ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం చేశానని, హమాస్‌పైనా దాడులు ఆపేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకుంటున్నారు. కానీ ఇజ్రాయెల్ మాత్రం వీలు చిక్కినప్పుడల్లా హమాస్‌పై దాడి



చేస్తోంది. గాజాను ఇప్పటికే ధ్వంసం చేసింది. గ్రేటర్ ఇజ్రాయెల్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న దాడులతో గాజా పూర్తిగా ధ్వంసమైంది. ఇటు ఇజ్రాయెల్ కూడా ఆర్థికంగా నష్టపోయింది. ఇలాంటి తరుణంలో జెరూసలెం పోస్ట్, ఇజ్రాయెల్‌కు సంబంధించిన ప్రముఖ మీడియా సంస్థ, ఇటీవల ఇజ్రాయెల్‌కు భారత్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది. భారత్ తన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో సంబంధాలలో వ్యవహరించే విధానాన్ని ఉదాహరణగా చూపుతూ, ఇజ్రాయెల్ తన విధానాలను పునఃపరిశీలించాలని సలహా ఇచ్చింది.ఇజ్రాయెల్ దశాబ్దాలుగా పొరుగు దేశాలతో ఉద్రిక్త సంబంధాలు, సైనిక ఘర్షణలు, భద్రతా సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ నిరంతర ఘర్షణలు దేశంలో ఆర్థిక, సామాజిక, మరియు రాజకీయ రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నిరంతర సైనిక ఆపరేషన్లు ఇజ్రాయెల్ ఆర్థిక వనరులను గణనీయంగా ఖర్చు చేస్తున్నాయి. రక్షణ బడ్జెట్‌లో పెరుగుదల, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను పరిమితం చేస్తోంది. నిత్యం కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు పోరులు, సైనికుల ప్రాణనష్టానికి దారితీస్తున్నాయి, ఇది సామాజిక అస్థిరతను పెంచుతోంది. భద్రతా ఆందోళనలు విదేశీ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తున్నాయి, ఫలితంగా కొత్త పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ఆర్థిక అస్థిరత, పరిశ్రమల కొరత కారణంగా దేశంలో స్థూల ఆదాయం తగ్గుతోంది, ఇది ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతోంది.జెరూసలెం పోస్ట్ భారత్‌ను ఆదర్శంగా సూచించడం వెనుక భారత్ యొక్క విధానాలు, ముఖ్యంగా పాకిస్తాన్‌తో సంబంధాలలో చూపే వ్యూహాత్మక సంయమనం ఉంది. భారత్ తన రాజకీయ, సైనిక, మరియు దౌత్యపరమైన విధానాల ద్వారా సమతుల్యతను కాపాడుతోంది. భారత్, పాకిస్తాన్‌తో సంబంధాలలో ఎప్పుడు, ఎలా స్పందించాలో జాగ్రత్తగా ఎంచుకుంటుంది. 2019 పుల్వామా దాడి తర్వాత బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్ ఒక లక్ష్య%-%ఆధారిత, నియంత్రిత చర్యగా ఉంది, ఇది విస్తృత యుద్ధానికి దారితీయలేదు. భారత్ ఇరాన్, ఇజ్రాయెల్, ఇతర మధ్యప్రాచ్య దేశాలతో సమతుల్య సంబంధాలను కొనసాగిస్తోంది. ఇది అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు విశ్వసనీయతను తెచ్చిపెట్టింది. భారత్ ఆర్థిక సంస్కరణలు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి సారించడం ద్వారా దేశీయ పరిశ్రమలను బలోపేతం చేస్తోంది. ఇది ఉపాధి అవకాశాలను పెంచి, ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారిస్తోంది.

# మరమ్మత్తులెప్పుడు


నిజామాబాద్, సెప్టెంబర్ 10, (

కామారెడ్డి పట్టణంలో పలు రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పూర్తిగా మూడు చోట్ల సీసీ రోడ్డు ధ్వంసం అయింది, ద్విచక్ర వాహనాలు గాని, ఫోర్ వీలర్స్ వాహనాలు, నడుచుకుంటా వెళ్లేందుకు కూడా రోడ్డు అనువుగా లేకుండా గుంతలు పడ్డాయి.భారీ వరదల వల్ల రోడ్లు కొట్టుకుపోయాయి.వరదల వల్ల కొట్టుకపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్న మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు కామారెడ్డి స్మశాన వాటికకు వెళ్లే రోడ్డు గురించి మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం ఈ రోడ్డు దుస్థితి గురించి కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లలేదంటే మున్సిపల్ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారు అర్థం చేసుకోవచ్చు. ప్రతిరోజు ఒకటి రెండు శవాలు ఈ స్మశాన వాటికకు వస్తున్నాయి. స్మశానానికి శవాన్ని తీసుకు రావడానికి ఎంతో మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.అంతేకాకుండా వారి బంధువులు నడుచుకుంటూ వెళ్లాలంటే కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. గత 15 రోజులుగా రోడ్డు ధ్వంసమైన తాత్కాలిక మరమ్మతులు కూడా మున్సిపల్ అధికారులు చేపట్టలేదు. కనీసం ఆ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారుల తీరుపై కామారెడ్డి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి ఉపయోగపడే స్మశాన వాటిక రోడ్డు మరమ్మత్తులపై నిర్లక్ష్యం వహించడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమతమైన చేపట్టి స్మశానానికి వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా కప్పిపుచ్చుకోవడం పై మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిసి రోడ్లు ధ్వంసం కావడంతో నడుచుకుంటూ వెళ్లేందుకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి.

# దిగొస్తున్న అమెరికా..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10

భారత్ మీద 50 శాతం టారిఫ్ అమలుచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్య అవరోధాలను పరిష్కరించడానికి, వాణిజ్య ఒప్పందం కోసం తమ ప్రభుత్వం భారతదేశంతో చర్చలుకొనసాగిస్తోందని తెలిపారు. చైనాకు భారతదేశాన్ని కోల్పోయానని కామెంట్ చేసిన కొన్ని రోజులకే భారత్ తో ట్రేడ్ డీల్ కోసం చూస్తున్నట్లు ట్రంప్ ప్రకటన చేశారు. భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని ట్రంప్ తనసోషల్ మీడియా ఖాతా ట్రూత్ సోషల్ లో ఒక పోస్ట్ చేశారు. “చాలా మంచి స్నేహితుడు అయిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో త్వరలో మాట్లాడటానికి ఎదురు చూస్తున్నాను. ఈ చర్చలు రెండు దేశాలు కోరుకున్న ఫలితాన్ని ఇస్తాయనే నమ్మకంఉందన్నారు. “భారతదేశం, అమెరికా దేశాల మధ్య వాణిజ్య అవరోధాలను పరిష్కరించడానికి చర్చలు కొనసాగుతాయని ప్రకటించడానికి నేను సంతోషంగా ఉన్నాను. మన రెండు గొప్ప దేశాలకు విజయవంతమైన ముగింపు లభిస్తుంది” అని డొనాల్డ్‌ట్రంప్ అన్నారు. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ లు చైనాలోని టియాంజిన్ లోని %ాజూ% సమ్మిట్ లో ఇటీవల సమావేశం అయ్యారు. భారతదేశం, రష్యా దేశాలను చైనాకు కోల్పోతున్నామని ట్రంప్ ఆ సమయంలోఅన్నారు. చైనాలో జరిగిన సమ్మిట్ లో ముగ్గురు నేతలు కలిసి దిగిన ఫోటోను కూడా ట్రంప్ షేర్ చేశారు.అయితే,



ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ, భారత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. ఇదే సమయంలో జీఎస్టీ స్లాబ్స్ సైతం తగ్గిస్తున్నట్లు ప్రకటించడంఅమెరికా బిగ్ షాకిచ్చినట్లు అయింది. దాంతో ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నారు. ప్రధాని మోదీని “గొప్ప ప్రధాన మంత్రి” అని సంబోధించారు. తాము ఎల్లప్పుడూ స్నేహితులుగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ కూడా స్పందిస్తూ ట్రంప్ మనోభావాలను గౌరవిస్తున్నాం. ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. గత వారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికా వస్తువులపై సున్నా శాతం సుంకాలు తగ్గించడానికి భారతదేశం ప్రతిపాదించిందని అన్నారు. అయితే, ఈ ప్రతిపాదన ఆలస్యమైందని, ఈ చర్యను చాలా సంవత్సరాల క్రితమే తీసుకోవాల్సిందన్నారు. భారతదేశ వాణిజ్య విధానాలను, రష్యాతో ఇంధన సంబంధాలను ట్రంప్ పలుమార్లు విమర్శించారు.నెలల తరబడి భారత్ మీద విషం చిమ్ముతున్న అమెరికా అధ్యక్షుడు భారత్ తో చర్చలకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. భారత్, అమెరికా ప్రతినిధులు చర్చించి వాణిజ్య ఒప్పందం చేసుకుంటారని శుభవార్త చెప్పారు. అయితే రష్యా నుంచి ముడి చమురును భారత్ కొనసాగించడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదు. అందుకే 25 శాతం అదనపు సుంకాలు భారత్ మీద విధించడం తెలిసిందే. భారత ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ ఇటీవల మాట్లాడుతూ.. ఈ సుంకాలు ఈ ఏడాది భారతదేశ జిడిపిలో 0.5 శాతం తగ్గించవచ్చని అన్నారు. యుఎస్ సెన్సెస్ బ్యూరో డేటా ప్రకారం, 2024 లో అమెరికా-భారత్ మధ్య వాణిజ్యం విలువ 129 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో వాషింగ్టన్ 45.8 బిలియన్ డాలర్ల లోటును నమోదు చేసింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధిస్తానని ఏప్రిల్ నెలలో ప్రకటించారు. మొదట టారిఫ్ ప్రకటించి తరువాత దాని మీద వెనక్కి తగ్గాడు. మూడు నెలలు విరామం ఇస్తున్నానని, అమెరికాతో ట్రేడ్ డీల్ చేసుకోవాలని పలు దేశాలకు సూచించారు. ఈ క్రమంలో ఆగస్టు 1 నుంచి భారత్ మీద పలు రంగాలపై 25 శాతం సుంకాలు విధించారు ట్రంప్. రష్యాతో ముడి చమురు కొనుగోలు ఆపని కారణంగా అదనంగా ఆగస్టు 27 నుంచి 25 శాతం టారిఫ్ విధించడంతో భారత్ మీద మొత్తం టారిఫ్ 50 శాతానికి చేరడంతో పలు రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పార్లపల్లి మరియు రాళ్ళదొడ్డి గ్రామంలో పొలం పిలుస్తోంది

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 10

ఎమ్మిగనూరు మండల పరిధిలోని పార్లపల్లి మరియు రాళ్లదొడ్డి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు సలహాలు సూచన అందజేయడంతో పాటు ఉల్లి పంట వేసిన రైతులు దాదాపుగా 100 నుంచి 110 రోజులకు మాత్రమే కోతకు వస్తుంది. అలా కాకుండా ముందస్తుగా కోత




కోయకూడదు ఉల్లిగడ్డ సైజు లో మరియు నాణ్యత ఉండి రైతులు ఆరబెట్టుకొని ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుకు తీసుకెళ్తే ప్రభుత్వ మద్దతు ధర వస్తుంది మరియు పంట నమోదు విధిగా చేయించుకోవాలి.అధిక యూరియా వాడకం వల్ల అనేక పర్యావరణ మరియు ఆర్థిక సమస్యలు తలెత్తుతున్నాయి:× నేల సారం తగ్గిపోవడం: రసాయన ఎరువుల అధిక వాడకం నేలలోని సూక్ష్మజీవులను, సేంద్రీయ పదార్థాన్ని నాశనం చేస్తుంది.× భూగర్భ జలాల కాలుష్యం: యూరియాలోని నైట్రేట్లు నీటిలో కరిగి భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి, ముఖ్యంగా పిల్లలలో ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ×యూరియా పై ముఖ్య సూచనలు:యూరియాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి , నేల సారాన్ని కాపాడటానికి అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి:1. నానో యూరియా: ఎఈఈఅూ అభివృద్ధి చేసిన ఈ ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా 500ఎశ్రీ బాటిల్‌తో ఒక 45 కిలోల యూరియా బస్తాకు ప్రత్యామ్నాయం. దీన్ని పిచికారీ రూపంలో పంట ఆకులపై చల్లితే, మొక్కలు నేరుగా పోషకాలను గ్రహిస్తాయి, దీనివల్ల వృథా తగ్గుతుంది మరియు పర్యావరణానికి హాని తక్కువగా ఉంటుంది.2. జీవ ఎరువులు (రాతీణజీనితిఇ ఈవతీబితిశ్రీతిళివతీబ): పశువుల ఎరువులు, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్ వంటివి భూమిలో సూక్ష్మజీవుల క్రియాశీలతను పెంచి, సహజంగా నైట్రోజన్‌ను అందిస్తాయి.3. బయోఫెర్టిలైజర్లు: అజోటోబాక్టర్, రైజోబియం, అజోస్పిరిల్లం వంటి సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని నేలలో స్థిరపరుస్తాయి, తద్వారా రసాయన ఎరువుల అవసరం తగ్గుతుంది.4. పంటల మార్పిడి (అతీనీజూ ఖీనీబిజీబితినీని): పప్పు పంటలను (కంది, పెసర, మినుములు) ఇతర పంటలతో మార్చి వేయడం వల్ల వాటి వేళ్ళలో ఉండే రైజోబియం బ్యాక్టీరియా నేలలో నత్రజనిని పెంచుతుంది.5. ఇంటిగ్రేటెడ్ న్యూట్రియెంట్ మేనేజ్‌మెంట్ (ఎఔఓ): రసాయన, జీవ , బయోఫెర్టిలైజర్లను సమతుల్యంగా వాడటం ద్వారా దీర్ఘకాలికంగా భూమి సారం నిలుస్తుంది.రైతులు యూరియా వాడకాన్ని తగ్గిస్తే తక్కువ ఖర్చుతోనే మెరుగైన ఫలితాలు పొందవచ్చు:× ఎరువు ఖర్చు తగ్గింపు: యూరియా బస్తాల సంఖ్య తగ్గుతుంది. ప్రస్తుతం వాడే యూరియాలో చాలా భాగం గాలిలోకి లేదా నీటిలోకి పోతుంది.ఇది వృథా ఖర్చు.× సమతుల్య ఎరువుల వాడకం: నానో యూరియా వంటి ప్రత్యామ్నాయాలను వాడితే తక్కువ మొత్తంలోనే పంటకు అవసరమైన పోషకాలు లభిస్తాయి.× భూమి సారం కాపాడడం: ప్రత్యామ్నాయాల వల్ల నేల సారం నిలిచి, భవిష్యత్తులో యూరియా కొనాల్సిన అవసరం తగ్గుతుంది.× పురుగుమందుల ఖర్చు తగ్గింపు: అధిక యూరియా వాడకం వల్ల పంటలు బలహీనపడి, పురుగులకు ఎక్కువగా గురవుతాయి. సమతుల్య పోషణతో పంటలు ఆరోగ్యంగా ఉంటాయి, తద్వారా పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది.× పంట దిగుబడి పెరుగుదల: సరైన పోషకాలు అందడం వల్ల పంటలు ఆరోగ్యంగా పెరిగి, అధిక దిగుబడిని ఇస్తాయి, రైతుకు అదనపు ఆదాయం లభిస్తుంది.ఈ కార్యక్రమంలో ఏఈఓ లు రసూల్ మరియు వినోద్ విహెచ్ఎ రమేష్, విఏఏ రాజేష్ పాల్గొన్నారు.

# దళిత సమ్మేళన సభ ను జయప్రదం చేయండి

, గోనెగండ్ల సెప్టెంబర్ 10 బుధవారం

ఈనెల 13న ఎమ్మిగనూరు పట్టణంలో కుర్ణి కళ్యాణ మండపం నందు పార్టీలకతీతంగా తలపెట్టిన "దళిత సమ్మేళన సభ" కు మాల, మాదిగ,బేడ, బుడగజంగాలు, ఎరుకుల సామాజిక వర్గాలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు యస్. దేవ సహాయం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగ లు పిలుపునిచ్చారు. వారు బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్ల ఎస్సీ కాలనీలో డప్పు కళాకారుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు కరుణాకర్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ముందుగా దళిత సమ్మేళన సభ కరపత్రంలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళితులు పోరాటాలతో సాధించుకున్న అంబేద్కర్ భవన స్థలంలో నిధులు కేటాయించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో భారత మాజీ ఉప ప్రధాని, దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గారి కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. గోనెగండ్ల మండలంలో ప్రతి గ్రామం నుండి దళితులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల ఎంపీటీసీ తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# మొన్న లంక.. నిన్న బంగ్లా.. ఇవాళ నేపాల్!

మొన్న శ్రీలంక, నిన్న బంగ్లాదేశ్, నేడు నేపాల్ ఇలా భారత సరిహద్దులలో ఉండే పొరుగు దేశాలలో ప్రభుత్వాల మీద అక్కడి నాయకుల మీద ప్రజా పోరాటాలు రచ్చకెక్కుతున్నాయి.తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ ప్రజా పోరాటాలతో అక్కడి దేశాధిపతులు

రహస్యంగా దేశ సరిద్దులు దాటి పొరుగు దేశాలలో తలదాచుకునే పరిస్థితులకు వస్తున్నారు. దీనంతటి వెనుక దాగున్న కారణాల పై నేడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది.ముందుగా శ్రీలంక విషయానికొస్తే అక్కడ ఆహార ధరలు ఆకాశాన్ని తాకడం,ఇంధన సంక్షోభం, డాలర్ కొరత



రావడంతో దేశం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్ళిపోయింది. అయితే పెరిగిన ధరలను నియంత్రించడంలో విఫలమైన శ్రీలంక ప్రభుత్వం ప్రజలలో పెరిగిపోయిన వ్యతిరేకతను కూడా అదుపు చేయడంలో చేతులెత్తేసింది.అవినీతి,కుటుంబ రాజకీయాలంటూ రాజపక్సే పాలన్ పై శ్రీలంక ప్రజలలో పెరిగిన వ్యతిరేకత నిరశన గా మారి శ్రీలంక ప్రభుత్వాధిపతుల ఆస్తుల ధ్వంశం వరకు వెళ్ళింది, చివరికి ఆ ప్రజా నిరసనలే హింసగా రూపాంతరం చెంది శ్రీలంక చరిత్రలో ఒక చీకటిఅధ్యాయాన్ని రచించింది.ఇక ఆ తరువాత ఈ సంక్షోభంలోకి బంగ్లా ప్రభుత్వం అడుగు పెట్టింది. బంగ్లా విషయానికొస్తే.., ద్రవ్యోల్బవం, పెరిగిపోయిన నిరుద్యోగ సమస్య, దానితో దేశంలో పెరిగిన పేదరికం కలిపి బంగ్లా ప్రజలు పోరాటం బాట పట్టారు.బంగ్లాదేశ్‌లోని షేక్ హసీనా ప్రభుత్వం పై అవినీతి ఆరోపణలు ఎక్కువడంతో పాటుగా మీడియా పై నియంత్రణ , ప్రతిపక్ష పార్టీల అణిచివేత తో హసీనా నియంతృత్వ ధోరణి పై బంగ్లా వ్యాప్తంగా నిరశన కార్యక్రమాలు ఉగ్రరూపం దాల్చాయి. దీనితో హసీనా దొంగ చాటుగాబంగ్లా దేశ సరిహద్దులు దాటాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.ఇక చివరిగా తాజాగా ఈ ప్రజా పోరాటాలతో భగ్గుమన్న నేపాల్ వివాదానికొస్తే, ఇక్కడి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, వారి స్వేచ్ఛ పై ప్రభుత్వం విధిస్తున్న నియంత్రణ కలిపినేపాల్ పార్లమెంట్ తగలబడే వరకు వెళ్ళింది, అలాగే అక్కడి మంత్రుల పై నిరసన కారులు నడి రోడ్ల మీద దాడుల చేసే వరకు పరిస్థితి దిగజారింది.రాజీనామాలు చేసి పారిపోతున్నప్రధానుల జాబితాలో తాజాగా నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి చేరారు.సోషల్‌మీడియాను బ్యాన్ చేయడంతో రగిలిపోయిన యువత ఉద్యమం చేపట్టారు. దీనికి అవినీతి, నిరుద్యోగం కారణాలు కూడా కలిసి మొత్తంగా యువత సహనం కోల్పోయేలా చేశాయి. దాంతో నేపాల్ అట్టుడికిపోయింది. పార్లమెంట్ ముట్టడికిప్రయత్నించడంతో ఆర్మీ కాల్పులు జరిపింది. ఇరవై మంది వరకూ చనిపోవడంతో పరిస్థితి పూర్తిగా కట్టు తప్పింది.మంగళవారం ఉదయమే సోషల్ మీడియా బ్యాన్ ను ఎత్తివేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. కానీ యువత తగ్గలేదు. యువత ఆగ్రహంచూసి నేపాల్ ప్రభుత్వంలోని మంత్రులంతా రాజీనామాల బాట పట్టారు. ప్రధానులు, మాజీ ప్రధానుల ఇళ్ల మీదకు యువత వెళ్లారు. ఇష్టం వచ్చినట్లుగా దాడులు చేశారు. దాంతో ప్రధాని కేపీ శర్మ ఓలీతోనూ ఆర్మీ రాజీనామా చేయించింది. ఆ విషయానిఅధికారికంగా ప్రకటించారు. తనను సురక్షితంగా దేశం బయటకు పంపాలని ఓలీ ఆర్మీని వేడుకున్నారు. ప్రస్తుతానికి ఆయనను రహస్య ప్రాంతానికి తరలించారు.ఇలా ప్రధాని రాజీనామా చేసి పారిపోయే పరిస్థితి వచ్చిన భారత్ పొరుగున ఉన్న మూడో దేశంనేపాల్. నేపాల్ దేశంలో పరిస్థితులు దారుణంగా మారిపోతున్నాయి. సామాజిక మాధ్యమాల మీద నిషేధ విధించారు అనే కారణంతో అక్కడ యువత వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. దారుణాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసంచేస్తున్నారు. ప్రైవేటు ఆస్తులను కూడా వదిలిపెట్టడం లేదు. దేశంలో అన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు చాలావరకు గృహాలకే పరిమితమవుతున్నారు. ఏకంగా పార్లమెంట్ భవనానికి నిప్పు పెట్టారు అంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందోఅర్థం చేసుకోవచ్చు. పైగా ఆందోళనకారుల వల్ల అక్కడ పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోంది. ఇప్పటికే అక్కడి ప్రధాని తన పదవికి రాజీనామా చేశారు. మంత్రులు కూడా రాజీనామా చేసి అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు.గొడవలతో అట్టడుకుతున్ననేపాల్ లో ప్రజాప్రతినిధులను, మాజీ మంత్రులను ఆందోళనకారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆంక్షలను లెక్క చేయడం లేదు. కర్ఫ్యూను పట్టించుకోవడం లేదు. భద్రతా బలగాలను లెక్కచేయడం లేదు. ఆస్తుల విధ్వంసంలో కూడా వెనకడుగువేయడం లేదు. నేపాల్ రాజధానిలో మాజీ ప్రధానమంత్రి ఖానాల్ నివాసానికి ఆందోళనకారులు నిప్పంటించారు. ఈ ప్రమాదంలో ఆమె సతీమణి తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. మంటల వల్ల చనిపోయినట్టు సమాచారం. ఈ ఘటన కంటే ముందునేపాల్ ప్రధానమంత్రి వ్యక్తిగత నివాసం పై కూడా ఆందోళనకారులు దాడులు చేశారు. దీంతో అక్కడ రాజకీయంగా సంక్షోభం ఏర్పడింది.సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడంతోనే దేశంలో ఆందోళనలు ప్రారంభమయ్యాయని.. నిరసనలువ్యక్తమవుతున్నాయని.. అవి కాస్త హింసాత్మకంగా మారాయని అక్కడి మీడియాలో వార్తలు వస్తున్నాయి. రాజకీయంగా వస్తున్న వారసత్వం పై కూడా నిరసనలు వ్యక్తమవుతున్నట్టు తెలుస్తోంది. అంతర్జాతీయ మీడియా నేపాల్ దేశంలో మొదలైనఅల్లర్లను నెపోకిడ్ మూమెంట్ గా అభివర్ణిస్తోంది. ఏకంగా పార్లమెంట్లోకి నిరసనకారులు దూసుకువెళ్లారు అంటే.. అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అంతర్జాతీయ మీడియా తన కథలను చెబుతోంది. నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర, మాజీఅధ్యక్షుడు పుష్పకమల్, మంత్రి పృధ్వి, హోం శాఖ మాజీ మంత్రి రమేష్ వంటి వారి ఆస్తుల మీద నిరసనకారులు దాడులు చేశారు. ఇక ఆర్థిక శాఖ మంత్రి ప్రసాద్ ను వీధుల వెంట పరుగులు పెట్టించి దాడి చేశారు. మాజీ ప్రధానమంత్రి బహదూర్, ఆయనసతీమణి దేవు బాలపై దాడి చేసి గాయపరిచినట్టు నేపాల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.గతంలో శ్రీలంకలో అలాగే పారిపోయారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు సర్దుకున్నాయి. తర్వాత బంగ్లాదేశ్ ప్రధాని కూడా పారిపోవాల్సి వచ్చింది. బెంగాల్ లో ఇంకాపరిస్థితులు సద్దుమణగలేదు. ఇప్పుడు.. నేపాల్ లో అలాంటి పరిస్థితి వస్తోంది. పాలకులు ప్రజల ఆకాంక్షలను అందుకోకపోతే.. వారిపై పెత్తనం చేయాలనుకుంటే.. ఎప్పుడో ఓ సారి ఆ అసహనం కట్టు తెగే ప్రమాదం ఉందని ఈ దేశాల యువతనిరూపిస్తున్నారు..ఈ మూడు దేశాల విషయంలోనూ కామన్ గా కనిపించే అంశాలు ముఖ్యంగా దేశంలో ఆర్థిక సంక్షోభం పెరిగిపోవడం, ప్రజా స్వామ్య హక్కుల ఉల్లంఘన జరగడం, ప్రభుత్వాధిపతుల అవినీతి హద్దులు దాటటం, ప్రజా హక్కుల పై అధికారంఅనే నియంతృత్వం పెరిగిపోవడం,దేశంలో నిరుద్యోగం, పేదరికం నాట్యం చేయడం, నిత్యావసర ధరలను అదుపులోకి తేలేకపోవడం, ప్రజల సమస్య పరిష్కారం పక్కన పెట్టి వారి విలాస జీవితాలకు ప్రాధాన్యం ఇవ్వడం తో ఆయా దేశాల ప్రజలలో మొదలైనతిరుగుబాటు దేశాధిపతులను సైతం దేశం విడిచి పారిపోయేలా చేస్తున్నాయి.ఇప్పటికైనా శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ ప్రభుత్వాల పాలన ఇతర దేశాల నియంతృత్వ ధోరణికి ఒక చెంపపెట్టు వంటిదని గ్రహించాలి. ప్రజలు ఎదురు తిరిగితే ఎంతటి కొమ్ములుతిరిగిన నేతలైన, అగ్రరాజ్య అధిపతులైన ప్రజా పోరాటాలకు తలవంచక తప్పదు, ఆ నిరశనకారుల ఉగ్ర రూపానికి తల దాచుకోక తప్పదు

# హరీష్ పొలిటికల్ శిఖరం

మెదక్, సెప్టెంబర్ 10

హైదరాబాదులో, హైదరాబాద్ తర్వాత అంతటి పేరు ఉన్న వరంగల్లో టిమ్స్ లు కనిపిస్తున్నాయి. అవి కేవలం భవనాలు మాత్రమే కాదు.. సమస్త తెలంగాణ ఆరోగ్యానికి సంజీవనిలు. కార్పొరేట్ వైద్యం అనేది తెలియని పేదలకు మెండైన భరోసా ఇచ్చే ఆరోగ్య ఆలయాలు. వాస్తవానికి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఉంటే.. అవి ఇప్పటికే ప్రారంభమయ్యేవి.. తెలంగాణ ప్రజలకు ఆరోగ్య భరోసాను కల్పించేవి. ప్రభుత్వం మారింది. నాటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఎంతో గొప్ప ఆశయంతో సంకల్పించిన టిమ్స్ లు ఎక్కడికి అక్కడే ఆగిపోయాయి. హరీష్ రావు సిద్దిపేట రూపురేఖలు మార్చారు. అలాగే ఆర్థిక శాఖ మంత్రిగా తెలంగాణకు సరికొత్త దశ దిశ



చూపించారు. ఆరోగ్యశాఖను తీసుకున్న తర్వాత అందులో సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రతి జిల్లాలోని ప్రధాన ఆసుపత్రికి సిటీ స్కాన్ వంటి యంత్రాలను సమకూర్చారు. అప్పట్లో సిటి స్కాన్ కోసం వెళ్లాలంటే ఎంజీఎం లేదా హైదరాబాద్ మాత్రమే దిక్కు. ఎక్కడో మారుమూల ఖమ్మం జిల్లాలో కూడా సిటీ స్కాన్ యంత్రాలను అదికూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయించిన ఘనత ముమ్మాటికి హరీష్ రావుది. టీ డయాగ్నస్టిక్స్ ఏర్పాటు హరీష్ రావు మానస పుత్రిక లాంటిది. దానిద్వారా మధుమేహం నుంచి మొదలు పెడితే థైరాయిడ్ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ కంటే ఎక్కువ ఖచ్చితత్వంతో ఫలితాలు చెబుతున్నారు. తద్వారా రోగులకు సత్వరంగా చికిత్స అంది.. మందులు కూడా లభిస్తున్నాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం హరీష్ రావు మీద కక్షతో టీ డయాగ్నస్టిక్స్ సేవలలో కూడా నిర్లక్ష్యం వహిస్తోంది. ఇటీవల వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రిలో సిటీ స్కాన్ యంత్రం పనిచేయలేదు. కనీసం దానికి మరమ్మతులు చేయించాలని కూడా ఈ ప్రభుత్వానికి లేకపోవడం అత్యంత దారుణమని రోగులు వాపోతున్నారుహరీష్ రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎల్ వో సీ లు విపరీతంగా ఇచ్చేవారు. ప్రభుత్వం మీద భారం పడుతున్నప్పటికీ ఏ ఒక్క ప్రాణం కూడా పోకూడదని తన కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని దీని కోసమే ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో నిమ్స్ ఆస్పత్రిలో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి పేషంట్లకు పడకలు దొరికేవి. అర్ధరాత్రి ఏ సమయానికి ఫోన్ చేసినా సరే ఆయన సిబ్బంది అందుబాటులో ఉండేవాళ్లు. దగ్గరుండి బెడ్లు ఏర్పాటు చేయించి.. సత్వర చికిత్స అందించేవారు. ముఖ్యంగా కాలేయం ఇతర సంబంధ వ్యాధులతో బాధపడే వారి కోసం నిమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారంటే అది ముమ్మాటికి హరీష్ రావు చొరవనే. ఇక సీఎంఆర్ఎఫ్ విషయంలో అయితే హరీష్ రావు చరిత్ర సృష్టించారు అని చెప్పుకోవాలి. తన సిద్దిపేట నియోజకవర్గ మాత్రమే కాకుండా తెలంగాణలో అన్ని ప్రాంతాల వారికి కొన్ని సందర్భాల్లో తన పరిధి దాటి మరి సహాయం చేసేవారు. అందువల్లే ఆయనను దేవుడు అని కొనియాడుతుంటారు.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చిన్న కోరుకొండిలో స్వామి అనే వ్యక్తి కాలేయ సంబంధ వ్యాధితో మంచానపడ్డాడు. ఆర్థికంగా కుటుంబం కూడా చితికిపోయింది. ఏం చేయాలో తెలియదు.. ఈ క్రమంలో తనకు తెలిసిన వారి ద్వారా ఆయన కార్యాలయాన్ని సంప్రదించారు. హరీష్ రావు వ్యక్తిగత కార్యదర్శి బీసగోని సిద్ధార్థ ఆ పేషంట్ వివరాలు తెలుసుకున్నారు. వెంటనే నిమ్స్ లోకి పంపించారు. దాదాపు అక్కడ 20 రోజుల పాటు అతడు చికిత్స పొందాడు. ఆ తర్వాత కోలుకున్నాడు. ఇప్పుడు స్వామి తన పనులు తాను చేసుకుంటున్నాడు. అంతేకాదు కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటున్నాడు. ఇలాంటివి చెప్పుకుంటూ పోతే ఆరోగ్య శాఖ మాజీ మంత్రి ఘనతలు కోకొల్లలు.రాజకీయ స్వార్థం కోసం.. ఇంకా ఇతర లక్ష్యాల కోసం కొంతమంది హరీష్ రావును విమర్శిస్తూ ఉండవచ్చు. పైశాచిక ఆనందం పొందుతూ ఉండవచ్చు. కానీ పార్టీతో సంబంధం లేకుండా.. వ్యక్తులతో సంబంధం లేకుండా హరీష్ రావును అభిమానిస్తారు. తెలంగాణలో ఏ ప్రాంతానికి వెళ్లిన సిద్దిపేట ప్రజల మాదిరిగానే ఆయనను ఆదరిస్తారు. ఒక నాయకుడు ఈ స్థాయికి వచ్చాడు అంటే కచ్చితంగా అతడు చేసిన మంచి పనులే దీనికి కారణం. ఇలాంటి పనులు హరీష్ రావు చాలా చేశారు. హార్డ్ వర్కింగ్ మినిస్టర్ గా పేరుపొందారు.. ఈ సువిశాల తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది మంత్రులయ్యారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు కూడా అయ్యారు. కానీ కొందరు మాత్రమే వాటికి వన్నె తీసుకొచ్చారు. అలాంటివారిలో హరీష్ రావు అగ్రస్థానంలో ఉంటారు. హరీష్ రావు ఒక వ్యక్తిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి.. ఒక వ్యవస్థగా తన పరిణామాన్ని అభివృద్ధి చేసుకున్నారు.

# చేతబడి నెపంతో ముగ్గురిని చావబాదిన గ్రామస్తులు

అశ్వారావుపేట సెప్టెంబర్ 10

అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామంలో మూఢనమ్మకాలతో ఊరి జనం మొత్తం కలిసి ఓ మూడు కుటుంబాలపై దాడిచేసిన ఘటన కలకలం రేపుతోంది.నందిపాడు గ్రామంలో నివాసముండే ఓ మూడు కుటుంబాల వారు రహస్యంగా చేతబడులు,బాణామతి వంటి క్షుద్రపూజలు చేస్తున్నారని గ్రామంలో కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో గడచిన రెండేళ్లలో గ్రామంలో జరిగిన ఆకస్మిక మరణాలకు ఈ మూడు కుటుంబాలకు చెందిన పాయం వెంకటేష్ (55)మడకం రంగయ్య (57)దేరంగుల దివాకర్(24) అనే వ్యక్తులే కారణమని, వీరు చేతబడి చేసి గ్రామస్తులను చంపేస్తున్నారంటూ ఊరంతా ఏకమై వీరిపై మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో రంగయ్య చేతి ఎముకలు విరిగిపోగా,వెంకటేష్ కి తీవ్రగాయాలయ్యాయి. దాడి భయంతో దివాకర్ పారిపోగా గ్రామస్తులు వారి ఇళ్లపై కూడా దాడిచేసి ఇంట్లో సామాన్లు కూడా ధ్వంసం చేశారు.గ్రామంలో ఇటువంటి పూజలు చేయవద్దని కుల పంచాయితీలు చేసినా వీరు తీరు మార్చుకోకపోవడంతో ఈ దాడి జరిగినట్టు గ్రామస్తులు అంటున్నారు. బాలారిష్టాలు, గాలి ధూళి సోకకుండా తాడు మాత్రమే కడతామని, వేరే ఏ క్షుద్ర పూజలు చేయమని బాధితులు అంటున్నారు.దాడిలో గాయపడ్డ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురు నిందితులపై కేసునమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ చేపట్టారు. ముగ్గురు గ్రామస్తులపై కేసు నమోదు అవ్వడంతో నిందితులకు సంఘీభావంగా గ్రామస్తులంతా పోలీస్ స్టేషన్ కి చేరుకున్నారు.

# నడీడులో గడీలను గడగడలాడించిన వీర వనిత చాకలి ఐలమ్మ

## భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరుకు బాటలు వేసింది
## ఆ పోరాటయోధురాలి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
## – మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
## చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి

నల్గొండ:ప్ల సెప్టెంబర్ 10

భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.బుధవారం ఆమె వర్ధంతి సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్ లో గల రజక భవనం ఎదుట చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..."నిజాం నవాబులను ఎదురించి, రజాకార్లను తరిమికొట్టిన ధీశాలి.వంగి దండాలు పెట్టే రోజుల్లో సివంగిలా గర్జించింది ఐలమ్మ అని మంత్రి కొనియాడారు.ఆమె కొంగు నడుముకు చుడితే దొరతనం తోక ముడిచింది. ఆమె కొడవలి చేతబడితే పీడిత జనం కదలిలా తరలివచ్చారు.ఆడదని అలుసుగా చూసిన కంట్లో నలుసు అయింది. ఆమె తెగింపుతోనే వెట్టిచాకిరీ ముగింపునకు వచ్చింది. నడీడులో గడీలను గడగడలాడించింది. ఎత్తిపట్టిన చేతిలో ఎర్రజెండా అయింది.ఆశయమే ఆశగా శ్వాసించింది. సాహసంతోనే సహవాసం చేసింది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరులో మమేకమైంది.

## బురదలో కూర్చొని.వినూత్నంగా నిరసన తెలియజేసిన ఆదివాసి గిరిజనులు

### తవ్వేసిన రోడ్డును. బురదలో. గొయ్యిలో కూర్చుని నినాదాలు తెలియజేశారు

చిన్నపాసిలి నుండి టి అజ్జపురం ః.ఔ వరకు రోడ్డును తవ్వేశారు. రోడ్డు పనులు మొదలు పెట్టాలి. కోరుతూ రామన్న దొర దొరపాలెం నుండిఖ కొట్నాబెల్లి రోడ్డు పనులు మొదలు పెట్టాలని కోరుతూ. బురద. గుయ్యిలో వినూత్నంగా రోడ్డుపై ధర్నా నిర్వహించడం జరిగింది అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చిన్నపాసిలి నుండి ఎర్ర బంధ. కే గదపాలెం. కే కొట్నాబెల్లి. ఖ కోట్నాబెల్లి. రామన్న దొరపాలెం. డోలవానిపాలెం. టి అర్జ పురం గ్రామాలకు 8000 మంది జనాభా కు ఉపయోగపడ(రు ) రోడ్డు నిమిత్త 30-10-2023 సంవత్సరంలో హై ఇంఫాక్ట్ రోడ్డు నిధులు నిమిత్తం( పి ఆర్ ప్రాజెక్ట్స్ వారికి14 కిలోమీటర్ల 6 కోట్ల98 లక్షల రూపాయలతో ఃబి రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. 2024 జనవరి నెలలో పనులు మొదలుపెట్టారు. ఆరు కిలోమీటర్ వరకు ఊః గ్రావెల్. పిక్క వేసి రోలింగ్ చేశారు . మరో రెండు కిలోమీటర్లు పి కోట్నాబెల్లి నుండి రామన్న దొర పాలెం వరకు రోడ్డుని తవ్వేసి వదిలేశారు. ఎందుకు పనులు నిలుపుదల చేశారని ఇంజనీరింగ్ అధికారులు అడిగితే. చేసిన రోడ్డు పనులు బిల్లు అవ్వలేదని. అందువలన నిలుపుదల చేసామని చెప్పారు. బాగున్న రోడ్డును తొవ్వేసి మెట్టలో పైకొచ్చినట్లుగా చేసినటువంటి వాటిని వెంటనే కప్పియాలని అధికారులు చెప్పిన పట్టించుకోలేదు. గత మూడు నెలల క్రితం గొయ్యిల్లో మొక్కలు నాటి వినూత్నంగా ధర్నా నిర్వహించడం జరిగింది దీనికి అధికారులు స్పందించలేదు దీంతో పాత కోట్ని బిల్లి గ్రామానికి కనీసం అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. వస్తే గొయ్యిల్లో దేవుడు పడతాయి. ఆర్ గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. గతంలో 2008 సంవత్సరంలో చిన్నపాసిల నుండి టీ అధ్యాపురం వరకు 2 కోట్ల 90 లక్షలు నిధులతో ః.ు రోడ్డు నిర్మాణం చేశారు. తారు రోడ్లన్నీ మట్టి రోడ్లుగా మార్చేసి. బ్రదర్ ఓట్లుగా తయారు చేశారు గ్రానైట్ క్వారీలు తిరగడం వల్ల. నేడు భారీ క్వారీ లారీలు వల్ల అతికే బరువు తీసుకెళ్లడంతో రోడ్లన్నీ బురదగా మారిపోయాయి. దీంతో మా ఆదివాసి గిరిజనులు గ్రామ సచివాలయం రావాలంటే 15 కిలోమీటర్ల నర్సి రావాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో కాంట్రాక్టర్ గారు తువ్వేసి వదిలేసిన రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని లేకపోతే భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు. గిరిజన సంఘం నాయకులు పాడి బెనియ్య. ఎస్ వలసయ్య తదితరులు పాల్గొన్నారు

## ఎయిమ్సర్‌లో ఫ్యాకల్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్

### నాయకత్వం నిరంతర సాధన : డీన్ డా.ఫ్రెడ్ జె. అగస్టిన్

చిత్తూరు:

అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ు రీసెర్చ్ (ఎయిమ్సర్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న ఫ్యాకల్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లోని సెమినార్ హాల్‌లో ఈ వర్క్‌షాప్‌ను ఎయిమ్సర్ డీన్ డా.ఫ్రెడ్ జె. అగస్టిన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "నాయకత్వం అనేది ఒక క్షణిక గమ్యం కాదు, నిరంతరంగా సాగిపోతూ ఉండే జీవన ప్రయాణం. లీడర్‌షిప్ కేవలం ఒక నైపుణ్యమే కాదు, ప్రతి రోజూ కొత్తగా నేర్చుకుంటూ ముందుకు సాగే అభ్యాసం. నేర్చుకోవడంలో విరామం తీసుకుంటే, అది మన ముందడుగు ఆగిపోవడమే. నిజమైన లీడర్‌షిప్ అంటే బాధ్యతను స్వీకరించడం, సహజమైన వ్యక్తిత్వంతో ప్రతిబింబించడం. ఇలాంటి వర్క్‌షాప్‌లు ఫ్యాకల్టీకి కొత్త దిశలు చూపించి, వారిని మరింత స్ఫూర్తిదాయకంగా తీర్చిదిద్దుతాయి" అని ఆయన స్పష్టం చేశారు.చెన్నైని అపోలో హాస్పిటల్స్ నుండి ప్రొఫెసర్ రవి మహాజన్, డా. జుగ్నూ మహాజన్ రిసోర్స్ ఫ్యాకల్టీగా పాల్గొని, అత్యంత ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డా. రమ్యా రామకృష్ణన్, ఏఐఎంఎస్ఆర్, ది అపోలో యూనివర్శిటీకి చెందిన పలు ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య

ఈ నెల 14, 15 తేదీలలో తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ కు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. సదస్సు జరగనున్న రాహుల్ కన్వెన్షన్ సెంటర్, అతిథులు బస చేయనున్న హోటల్ గదులను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఎవరికి కేటాయించిన విధులు వారు చక్కగా సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. వచ్చిన అతిథులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని అన్నారు.

# మాట ఇచ్చారు.. ఐదు లక్షలు అందించారు..

## పటాన్చెరు సత్యసాయి సేవా సమితికి అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్

### సత్య సాయి సేవా సమితి సేవలు అభినందనీయం

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..





పటాన్‌చెరు సెప్టెంబర్ 10 భారత శక్తి శ్రీ సత్య సాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో సమాజ అభివృద్ధికి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని.. నవంబర్లో జరగనున్న సత్య సాయిబాబా గురుపూర్ణిమ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గము నుండి 3000 మంది భక్తులు తరలి వెళ్తున్నారని.. ఇందుకోసం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల సత్య సాయి బాబా మందిరంలో గురు పూర్ణిమ పురస్కరించుకొని వంద రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అట్టడగు వర్గాల అభివృద్ధికి సత్య సాయి బాబా చేసిన సేవలు ప్రపంచవ్యాప్తంగా పేరు పొందాయని తెలిపారు. పటాన్చెరులో సత్యసాయి బాబా మందిరం నిర్మాణానికి సైతం గతంలో తాను సంపూర్ణ సహకారం అందించినట్టు గుర్తు చేశారు. సత్య సాయి బాబా సేవ సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోనూ గతంలో ప్రజలకు ప్రత్యేక నీటి ట్యాంకులు నిర్మించి మంచినీటిని అందించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో సత్య సాయిబాబా మందిరాలు నిర్మాణాలకు భూమిని సైతం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సత్యసాయి బాబా సేవాసమితి బాధ్యులు రామి రెడ్డి, వెంకటేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన రిజర్వాయర్లతో ప్రతి ఇంటికి స్వచ్ఛ జలాలు

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### అమీన్పూర్ బంధం కొమ్ములో నూతన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరా ప్రారంభం..

### హాజరైన ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి..






అమీన్ పూర్ సెప్టెంబర్ 10 భారత శక్తి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నూతన రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన జలాలు అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము శ్రీకృష్ణ బృందావన్ కాలనీలో 11 కోట్ల 32 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన 2 మిలియన్ లీటర్ల %+యా=% రిజర్వాయర్ పైపులైన్ వ్యవస్థను బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు 300కు పైగా కాలనీలతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యకు ఇబ్బందులు తలెత్తకుండా ఐదు రిజర్వాయర్లు నిర్మించామని తెలిపారు. నూతన కాలనీలలో సైతం మంచినీటి పైపులైన్లు వేయడంతో పాటు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. నీటి కొరతకు ప్రత్యేకగా నిలిచి అమీన్పూర్ మున్సిపాలిటీలో నేడు ప్రతి ఇంటికి మంచినీరు అందించిన ఘనత తమకే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పూర్తి సహాయ సహకారాలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సుబ్బారాయుడు, డీజీఎం చంద్రశేఖర్, ఏఈ పూర్ణేశ్వరి, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్10:సంగారెడ్డి పట్టణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు .ఈ



సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ - తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ ఒక మహోన్నతమైన స్థానాన్ని సంపాదించారు. ఆమె పోరాట స్ఫూర్తి, ధైర్యం ఈ తరానికి ఆదర్శం. తెలంగాణ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవడం ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు.

ఈ సందర్భముగా టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ %-% చాకలి ఐలమ్మ తొలి భూ పోరాటానికి నాంది పలికిన సాహసవనిత. రజాకర్ల అరాచకాలకు ఎదురొడ్డి ఎర్రజెండా పట్టి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారు. అలాగే, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల హైదరాబాదులోని కోఠి ఉమెన్స్ కాలేజీని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా అమ్మాయిలకు ఉన్నత విద్యలో కొత్త అవకాశాలు కల్పించిందని చెప్పారు. చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచారని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, జిల్లా టీజీవో అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, సంగారెడ్డి తహసీల్దార్ జయరాం, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్, వెనుకబడిన తరగతుల జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, రజక సంఘ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు,సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)సెప్టెంబర్ 10:బాసర మండలంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. దెబ్బతిన్న పంట లను పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి అందజేయాలని అధికారులనుఆదేశించారు. రైతులకు నష్టపరిహారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# నిర్మల్ జిల్లాలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)సెప్టెంబర్ 10:నిర్మల్ జిల్లా లో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు

శాఖ మంత్ర జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లా పర్యటన సందర్భంగా బాసర గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పూల మొక్క అందించి మంత్రిని ఆత్మీయంగా స్వాగతం పలికారు.భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి లు కూడా పూల మొక్కలు అందించి మంత్రిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం పోలీసులు మంత్రికి గౌరవ వందనం సమర్పించారు.



## వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన - కార్పొరేటర్ కళ్లెం నవజీవిన్ రెడ్డి ..!

హయత్ నగర్, (భారత శక్తి) సెప్టెంబర్ 10 :

తెలంగాణ వీరమాత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా



చింతలకుంట వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంగి దండాలు పెట్టే రోజుల్లో సివంగిలా గర్జించి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి దొరలను గడగడలాడించి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఎదిరించి కొట్లాడిన వీరవనిత మన చాకలి ఐలమ్మ ఆమె ధీరత్వం అందరికీ స్ఫూర్తి దాయకం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్,నాయకులు సూర్య నాయక్, ఎర్ర శ్రీకాంత్ కురుమ మరియు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ తండా నుండి తెలంగాణ తిరుపతి దేవస్థానంకు వెళ్లే దారి మరమ్మతులు



కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10: బీర్కూర్ మండలంలోని బీర్కూర్ తండా నుండి తెలంగాణ తిరుపతి దేవస్థానంకు వెళ్లే దారిలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్డుకు 1 లక్ష 20 వేల రూపాయలతో మరమత్తు పనులను చేపట్టారు. అదేవిధంగా ఇదే రహదారిపై ఆరు కల్వర్టులను నిర్మించేందుకు 20 లక్షల రూపాయలు మంజూరైన పనులు ప్రారంభిస్తున్నామని ఈ పనులను పర్యవేక్షిస్తున్న బాన్స్ వాడ పంచాయతీరాజ్ ఈఈ ఆంజనేయులు తెలిపారు.

## గోర్ సేన ఆధ్వర్యంలో శాంతి యుత ర్యాలీ

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10:

సంగారెడ్డి జిల్లాలో గోర్ సేన ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని సుప్రీంకోర్టులో తెల్లా వెంకట్రావు, సోయం బాబురావులు పిటిషన్లు దాఖలు చేయడాన్ని గోర్ సేన తీవ్రంగా ఖండించింది. దేశంలో 18 కోట్లకు పైగా బంజారాలు గిరిజన జాతికి చెందినవారని, వారిని 1976లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చిందని, ఇప్పుడు దానిని వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని గోర్ సేన నాయకులు పేర్కొన్నారు. కేవలం రాజకీయ లాభాల కోసమే



అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉన్న ఆదివాసి లంబాడీల మధ్య చిచ్చులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, గతంలో లంబాడీల ఓట్లతోనే గెలిచానని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు వారినే మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర రాజకీయాల్లో లంబాడీల ఓట్లు కీలకమని భావించి వారిని విచ్ఛిన్నం చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించిన గోర్ సేన, కాంగ్రెస్ పార్టీ తక్షణమే తెల్లా వెంకట్రావు మరియు సోయం బాబురావులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసింది. ఈ ర్యాలీలో గోర్ సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్ రాథోడ్, సంగారెడ్డి గోర్ సేన అధ్యక్షులు బానోత్ రాజు నాయక్, నారాయణ్ రాథోడ్, శంకర్ నాయక్, జైపాల్ నాయక్, పరిలాల్ నాయక్ పాల్గొనగా, పెద్ద ఎత్తున విద్యార్థులు, మహిళలు, యువత, సమాజ పెద్దలు హాజరై ఐక్యతను ప్రదర్శించారు.

# సాటి లేని తొలి తెలుగు సినీ కళాకారిణి శ్రీమతి భానుమతి

## మహానటి భానుమతి జయంతి సందర్భంగా....



భారత దేశం గర్వించదగ్గ నటీమణులలో భానుమతి రామకృష్ణ ఒకరు. ఆమె నటిగా, గాయనిగా, రచయిత్రిగా, నిర్మాతగా, సంగీత దర్శకురాలిగా, దర్శకురాలిగా ఆమె అందుకున్న శిఖరాగ్రాలు అనితరసాధ్యమైనవి. అజరామంమైనవి. సుమారు ఏడు దశాబ్దాలు ఆమె సినీ కళామతల్లికి చేసిన సేవలు అనన్య సామాన్యాలు. చలన చిత్ర ధరిత్రి చరిత్ర ముఖద్వారాన్ని గర్వకారణాల తోరణాలతో అలంకరించడానికి అక్షర క్రమాన పేర్లు ఎన్నిక చేస్తే ఈ శీర్షిక క్రిందకు వచ్చే మొట్టమొదటి పేరు భానుమతి రామకృష్ణ ది. కేవలం పురుషులకే సాధ్యం అయిన సినీ సాంకేతిక నైపుణ్యంలోనూ ఎంతో ప్రావీణ్యం సంపాదించి, గొప్ప నటిగా, గాయనిగా, దర్శకురాలిగా, నిర్మాతగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా, విభిన్న కోణాలను స్పృశిస్తూ.. సాటిలేని మేటి తెలుగు కళాకారిణిగా, ఒక విధంగా తెలుగు సినీ కళావధానం చేసిన తొలి తెలుగు సినీ కళావధానిగా బహుముఖీన ప్రజ్ఞాశాలిగా భానుమతి ఆవిష్కృతమవుతారు.

తండ్రి స్ఫూర్తితో కళాకారిణిగా..

1925 వ సంవత్సరం సెప్టెంబర్ 7వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని దొడ్డవరం గ్రామంలో భానుమతి జన్మించారు. హీరోయిన్లుగా ఆడవారి వేషాలు కూడా మగవారే వేసే ఆ రోజుల్లో ధైర్యంగా నేనున్నానంటూ కేవలం 13 ఏళ్ల ప్రాయంలోనే ఇంట్లో సనాతన కట్టుబాట్లను సైతం ఎదిరించి, సంప్రదాయ సంగీత కళాకారుడైన తండ్రి బొమ్మరాజు వెంకటసుబ్బయ్యను ఒప్పించి, సినిమాలలో వేషం కట్టారు భానుమతి. తండ్రి స్ఫూర్తితో తాను కూడా సంప్రదాయ సంగీతాన్ని, నృత్యాన్ని శ్రద్ధగా నేర్చుకొని, అపార సంగీత జ్ఞానాన్ని సమపార్జించుకొని అచిరకాలంలోనే మంచి కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1939 లో సుప్రసిద్ధ దర్శకుడు సి. పుల్లయ్య తీసిన వర విక్రయం సినిమాలో ఆమె స్వాతంత్ర్యమే లేదా? స్త్రీ జాతికి అన్న పాట, జాతికి ఈ సూత్రంబే" అన్న పాట పాడారు. ఆ పాటలు ఆ రోజుల్లో ఇంటింటా మారుమ్రోగాయి. సినిమా ఘన విజయం సాధించింది. తర్వాత సి పుల్లయ్య 1940 లో తీసిన మాలతీ మాధవం లో ఆమెకు నాయక పాత్రను ఇచ్చారు. ఆ చిత్రం పరాజయం పొందింది. అయినా సరే, ఆమె నిరాశతో వెనుకడుగు వేయలేదు. ఇంకా ఉత్సాహంతో ముందుకు నడిచి.. ధర్మపత్ని, భక్తి మాల సినిమాలలో అద్భుతంగా నటించి గొప్ప కీర్తిని గడిచింది.

రామకృష్ణారావుతో వివాహం

అయితే 1943 లో కృష్ణ ప్రేమ సినిమాలో నటించింది భానుమతి ఈ కృష్ణ ప్రేమ కాస్తా రామకృష్ణ ప్రేమగా మారింది. అంటే ఆ సినిమాకి సహాయ దర్శకుడిగా పనిచేసిన రామకృష్ణారావును భానుమతి ఇష్టపడి 1943 ఆగస్టు 8వ తేదీన వివాహం చేసుకుంది. వీరిద్దరి ఏకైక కుమారుడే భరణి కుమారుడి పేరు మీదనే భరణి సంస్థ స్థాపించిన ఆ దంపతులు అనేక అపూర్వ చిత్రాలను అందించారు. ఆరోజుల్లో చిత్రాల్లో ఆమె హీరోతో సమానమైన పాత్రలని ఒప్పుకునేవారు. పారితోషకంలోనూ హీరోలతో సమానంగానే పోటీపడేవారు. ఏ విషయమైనా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడే అలవాటు ఆవెది. అందువల్ల అందరూ ఆమెకు తల పొగరు, అహంకారం అనుకునేవారు అయినా ఆమె ఎన్నడూ చలించలేదు. అహంకారం నాకు అలంకారమే! అని తెగేసి చెప్పేవారు.

'స్టార్' గా నింగికెగసిన కీర్తికేతనం

1946 లో బి.ఎన్.రెడ్డి దర్శకత్వం వహించిన స్వర్గసీమ తో భానుమతి గొప్ప నటి గా ప్రశంసలు పొంది, 'స్టార్' గా ఎదిగారు దక్షిణాది రాష్ట్రాల్లో స్వర్గసీమ విజయ శంఖం మ్రోగించడంతో భానుమతి కీర్తి పతాకం మింటికి ఎగిసింది. స్వర్గసీమలోని ఆమె పాత్ర అమాయకురాలైన కూచిపూడి నాట్యగత్తె. ఈ పాత్రలోని దశలు భానుమతి నటనా శక్తికి గీటురాళ్లు అనవచ్చు. సహజంగా సంభాషణలు చెప్పడంలో, పాడడంలో ఆమెకు ఆమే సాటి. అని ఈ చిత్రం ద్వారా ఆమె నిరూపించుకున్నారు. భానుమతి మధురమైన గాయని ఆమె కంఠం నుడులు చక్రాలు తిరిగినట్టు పలుకుతుంది. ఆమెను అనుసరిస్తూ పాడడం అంత తేలికైన విషయం కాదు. భానుమతి వేరెవరికి ప్లే బ్యాక్ పాడలేదు. తనకెవరు పాడలేదు. అయితే చండీరాణి హిందీలో మాత్రం సంధ్య కి భానుమతి గాత్ర దానం చేశారు.

సన్మానాలు పురస్కారాలు బిరుదులు

భానుమతిలో మంచి హాస్యం, వ్యంగ్యం, చమత్కారం చక్కటి మేళవింపుతో కనిపిస్తాయి. అవన్నీ కలగలిపి ఆమె "అత్తగారి కథలు" రాశారు. అవి తెలుగు నాట బహుళ ప్రసిద్ధి పొందినాయి. ఆ రచనకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. విప్రనారాయణకు సాలూరు రాజేశ్వరరావు సంగీత దర్శకుడైనా భానుమతి సంగీత పర్యవేక్షణ అంటూ తన పేరు వేసుకున్నారు. తాను పాటలకి స్వర కల్పన చేసినా రికార్డింగ్ మాత్రం సత్యం చేత, వేణు చేత చేయించారు. ఆమె నటనా ప్రతిభకు 1966 లో పద్మశ్రీ, 2000 లో పద్మభూషణ్, 1975 లో ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారాలు బహూకరించాయి. భానుమతి మూడుసార్లు జాతీయస్థాయి ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. తమిళనాట కూడా ఆమె చిత్రాలు విజయ దుందుభులు మ్రోగించాయి. అప్పట్లో తమిళనాడు ముఖ్యమంత్రి అన్నాదురై భానుమతికి ప్రతిష్టాత్మకమైన 'కలైమామణి' బిరుదును ఇచ్చి సత్కరించడం విశేషం. తమిళనాట ఆమెను 'తెలుగు సినీ అష్టావధాని' గా పిలిచేవారట. ఎందుకంటే అప్పటికే భానుమతి నటిగానే కాక తన పాత్రకు తానే పాటలు స్వయంగా పాడుకునేవారట.

బహుముఖ ప్రజ్ఞతో ఎందరికో ఆదర్శంగా నిలిచి

తన కుమారుడు భరణి పేరుతో భర్త రామకృష్ణ దర్శకత్వంలో చిత్ర నిర్మాణం ఆరంభించి రత్నమాల, లైలామజ్ను, ప్రేమ, చండీరాణి, చక్రపాణి, విప్రనారాయణ, చింతామణి, వరుడు కావాలి, బాటసారి, వివాహ బంధం, గృహలక్ష్మి, అంతా మనమంచికే, విచిత్ర వివాహం, అమ్మాయి పెళ్లి, మనవడి కోసం, రచయిత్రి, ఒకనాటి రాత్రి, భక్త ధృవ మార్కండేయ తదితర చిత్రాలు నిర్మించారు చండీరాణిని మూడు భాషల్లో నిర్మించారు. భానుమతే డైరెక్షన్ చేశారు. ఇలా తెలుగులో మొదటి దర్శకురాలిగా పేరు తెచ్చుకున్నారు. వరుడు కావాలి, అమ్మాయి పెళ్లి, మనవడి కోసం, రచయిత్రి, ఒకనాటి రాత్రి, భక్త ధృవ మార్కండేయ చిత్రాలకు కూడా ఆమెనే దర్శకత్వం వహించారు. దాదాపు 200 కు పైగా చిత్రాలలో నటించిన భానుమతి మూడు తరాల నటులతో పనిచేసిన ఆమె చివరికి నందమూరి తారకరామారావు కుమారుడు బాలకృష్ణతో 'మంగమ్మగారి మనవడు' చిత్రంలో నటించడమే గాక, ఆ చిత్రంలో 'టైటిల్ రోల్' ను కూడా పోషించారు. తన బహుముఖ ప్రజ్ఞా విశేషాలతో సినీ జగత్తులో ఎన్నో సాధించి, ఎందరెందరికో ఆదర్శంగా నిలిచిన భానుమతి రామకృష్ణ 2005 వ సంవత్సరం డిసెంబర్ 24 వ తేదీన చెన్నైలోని స్వగృహంలో శాశ్వతంగా కన్నుమూశారు. ఆ మహానటి అనంత దూరాలకు వెళ్ళిపోయినా ఆమె గళం నుంచి జాలువారిన గీతాలు, ఆమె కలం నుంచి ఆవిష్కరించబడిన రచనలు ఎప్పటికీ అజరామరంగా నిలిచే ఉంటాయి. తెలుగు సినీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటాయి.



చౌదూరి నరసింహారావు
పత్రికారచయిత, విశ్లేషకులు

## తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ ఘనంగా వర్ధంతి వేడుకలు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐ లమ్మ వర్ధంతి కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎల్.బి. చందర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్డీవో వీనా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాటానికి చిహ్నం. దళిత%-%బహుజన సమాజానికి ఆమె ధైర్యం, పోరాటస్ఫూర్తి నింపిన మహనీయురాలు. ఆమె త్యాగం, వీరస్వభావం తరతరాలకు ఆదర్శం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, నాగభూషణం, రాజయ్య , శ్రీకాంత్,నాగరాజు, రాజేశ్వర్, పవన్, అశ్వక్, సునీత, విజయ, జిల్లా అధికారులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు పునరుద్ధరణ



కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10: జనగాంమర్రి నుండి మామ్దాపూర్ వరకు ఆర్ అండ్ బి రహదారి ఇటీవల కురిసిన అతి భారీ వర్షాల కారణంగా దెబ్బతింది. రహదారి పైభాగం కొట్టుకుపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో రహదారి మరమ్మతు పనులు వేగంగా కొనసాగుతున్నాయి.రాబోయే రోజుల్లో రహదారిని పూర్తిగా పునరుద్ధరించి రాకపోకలకు అనుకూలంగా మార్చే చర్యలను ఆర్ అండ్ బి అధికారులు చేపడుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలి

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. విజయపాల్ రెడ్డి పాల్వంచ మండలంలోని ఇస్సాయిపేట్, పాల్వంచ గ్రామాలలో, మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలోని వివిధ నిర్మాణ దశలలో, నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ మెంబర్లకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమునకు సంబంధించి పూర్తి అవగాహన కల్పించినారు. వారి యొక్క సందేహములను నివృత్తి పరిచారు. ఇట్టి కార్యక్రమంలో లబ్ధిదారులకు వారు స్వయంగా స్టేజి ఫోటోలను అప్లోడ్ చేయు వివరములను, లబ్ధిదారులు ఏదైనా వివరములు, సమస్యలు విన్నవించుటకై ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18005995991 గూర్చి వివరించడం జరిగింది. ఇట్టి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమునకు సంబంధించి అవసరమగు ఇసుకను ప్రభుత్వం సంబంధిత మండల రెవెన్యూ అధికారి ద్వారా లబ్ధిదారులు ట్రాక్టర్ కిరాయి, లేబర్ ఏర్పాటు చేసుకొని ఉచితంగా సరఫరా చేయబడుటకు వివరములను తెలియజేసినారు. ఇట్టి గృహ నిర్మాణములకు సంబంధించి ఎవరికిని ఎలాంటి డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని, ఇవ్వకూడదని తెలియజేయడం జరిగినది. లబ్ధిదారులు తమకు సంబంధించిన వివరాలను ఇందిరమ్మ వెబ్సైట్లో స్వయంగా తెలుసుకోవచ్చునని ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వ వెబ్సైట్ గురించి తెలియజేసినారు.ఇట్టి పర్యటనలో భాగంగా పాల్వంచ మండలములో నిర్మించినటువంటి నమూనా గృహమును సందర్శించి లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు తక్కువ ఖర్చుతో దృఢంగా ఇంటి నిర్మాణం చేసుకొనుటకు అవగాహన కల్పించినారు.ఈ కార్యక్రమంలో వై సుభాష్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్), ఎం శ్రీనివాస్, ఏ ఈ (హౌసింగ్), ఎంపీడీవో లు పాల్వంచ, మాచారెడ్డి, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గౌడ జర్నలిస్టులకు ఆత్మీయ సన్మానం



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (భారత శక్తి): జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ కమ్యూనిటీ హాల్ లో కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని గౌడ జర్నలిస్టులను సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు హాజరై మాట్లాడు తూ కల్లు గీత కార్మికుల ఉద్యమాలను ముందుకు తీసుకొని పోవాలని అలాగే గౌడ జర్నలిస్ట్ లు ఐక్యంగా ఉండి భవిష్యత్తు ఉద్యమాలలో ప్రత్యేకంగా పాల్గొని సంఘం లో భాగస్వాములు కావాలని రవిగౌడ్. శ్రీనివాస్ గౌడ్ లు పిలుపు నిచ్చారు. కార్యక్రమానంతరం గౌడ జర్నలిస్టులను సంఘ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎస్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి చైతన్య గౌడ్

దేశిని మహేందర్ గౌడ్. మామిడి సంపత్ గౌడ్. గట్టు ప్రశాంత్ గౌడ్. దేశిని వినయ్ గౌడ్. మొడెం సారంగపాణి గౌడ్. నాగపూరి హరినాథ్ గౌడ్. కోలా కోటి గౌడ్.వేముల సతీష్ గౌడ్.కునూరు మహేందర్ గౌడ్ తో పాటు 15 మంది గౌడ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

### శేరిలింగంపల్లి జోన్ లోపారిశుద్ధ్య కార్యక్రమాల తనిఖీలో

### జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్



హైదరాబాద్, (భారత శక్తి )సెప్టెంబర్ 10:

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి..సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు.బుధవారం శేరిలింగంపల్లి జోన్ పరిధి యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులనుజిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్తనిఖీ చేశారు.

క్షేత్రస్థాయిలో చెత్త తొలగింపు, స్వీపింగ్, వ్యర్థాల నిర్వహణపై సానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావులతో సమీక్షించారుస్థానికులతో కమిషనర్ మాట్లాడారు.

ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ కమిషనర్ ప్రశ్నించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు జిహెచ్ఎంసీ సిబ్బందికి సహకారం అందించాలని కోరారు.క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావంతంగా సాగేలా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జోనల్, సర్కిల్ అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారుసకాలంలో చెత్త సేకరణ వెంటనే చేపడుతూ పరిశుభ్రత నెలకొనేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ సూచించారు.

# ప్రజాసేవే నా జీవన లక్ష్యం చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, ( సంగారెడ్డి భారత శక్తి ప్రతినిధి )సెప్టెంబర్ 10 :

ప్రజలకు అండగా నిలిచి సేవలు అందించడమే తన జీవిత లక్ష్యమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తన జన్మదినం



సందర్భంగా ఉమ్మడి జిన్నారం మండలంలోని ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ వేదపండితులు ఘనంగా పూజలు జరిపి గోవర్ధన్ రెడ్డికి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ప్రాంగణ భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని, ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతి కోసం కృషి చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై పనిచేయడం ద్వారానే నిజమైన నాయకత్వం సాధ్యమవుతుందని, ప్రజా నమ్మకం నిలబెట్టుకోవడమే తన పెద్ద కర్తవ్యమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఉమ్మడి జిన్నారం మండల ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమకొండ లో నవంబర్ 10- 23వరకు

## ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ



ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్10:

ఆర్మీలో చేరేందుకు గత కొన్ని నెలల క్రితం ఆన్లైన్ విధానంలో పరీక్ష నిర్వహించగా అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నవంబర్ 10నుండి 23వ తేదీ వరకూ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీని ఆర్మీ అధికారులు నిర్వహిస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.

బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ గురించి ఆర్మీ అధికారులు జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమావేశమై ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోని ఆర్మీ రిక్రూట్మెంట్ కల్నల్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ ఆర్మీలో అగ్ని వీర్ నియామకాల కోసం గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు. ఈసారి హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్మీలో అగ్ని వీర్ ల నియామకాల ఇప్పటికే దరఖాస్తు ఆన్లైన్ విధానంలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వేల మంది వరకు అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రన్నింగ్ టెస్ట్ తో పాటు శారీరక సామర్థ్య పరీక్షలు, మెడికల్ టెస్ట్, విద్యార్హతల ధ్రువ పత్రాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తోడ్పాటునందించాలని అన్నారు. స్టేడియంలో ట్రాక్ తో పాటు బ్యారికేడింగ్, టెంట్లు, షామియానాలు, విద్యుద్దీపాలు , సీసీ కెమెరాలు, జనరేటర్, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ బందోబస్తు, మెడికల్ టీం, అగ్నిమాపక, 108 వాహనాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని ఆర్మీ అధికారులకు వివరించారు. రాష్ట్రంలో గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించగా ఈ ఏడాదిలో హనుమకొండ జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించే అవకాశం దక్కడంతో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్మీ మేజర్ ప్రకాష్ రాయ్, ఆర్మీ అధికారులు గురు దయాల్ సింగ్, సుభాష్, వి.వి. నాయుడు, వినోద్ కుమార్ శర్మ, మనీష్ కుమార్, ఆర్డీఓ రాథోడ్ రమేష్, డిఆర్డివో మేన శ్రీను, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, సిపిఓ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, స్పోర్ట్స్ అధికారి అశోక్ కుమార్, హనుమకొండ ఏసిపి నరసింహారావు, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (భారత శక్తి) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.

చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి



హాజరైన అధికారులు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె వీరోచిత గాథను స్మరించుకున్నారు.బీసీ వెల్ఫేర్ అధికారి తుల రవి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో మహిళా శక్తి ప్రతీకగా నిలిచారు. భూస్వాముల దౌర్జన్యాలకు తలొగ్గకుండా రైతుల పక్షాన నిలబడి పోరాడారు. ఆమె త్యాగస్ఫూర్తి, ధైర్యసాహసాలు ఇవాళ్టి తరానికి గొప్ప స్ఫూర్తి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు గర్వకారణం అని తెలిపారు.అలాగే ఆయన ఐలమ్మ చరిత్రను విద్యార్థులకు పరిచయం చేయాలని, పాఠశాలల్లో ఆమె వీరోచిత పోరాటాలను ప్రత్యేక వ్యాసాల రూపంలో బోధించాలని సూచించారు.రజక సంఘం నాయకులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, తెలంగాణ రైతాంగ పోరాటానికి చిహ్నంగా నిలిచారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని అన్నారు.

కార్యక్రమములో మణికంట రజక సంఘం అధ్యక్షుడు మరియు చాకలి ఐలమ్మ వర్ధంతి %ఁ% జయంతి కమిటి అధ్యక్షుడు నగరపు రమేష్ , మణికంట రజక సంఘం ప్రధాన కార్యదర్శి చాపర్తి రాజు, మణికంట రజక సంఘం కోశాధికారి ఎన్నిండ్ల మహేందర్, ఉపాధ్యక్షుడు పరికిరాల రవి, సహాయ కార్యదర్శి గూడెల్లి ఓదెలు, సలహాదారులు నేరెళ్ళ శంకర్ , మరియు జాలిగం శ్రీనివాస్ ,ఎన్ హెచ్ ఆర్ సి అధ్యక్షుడు మోగుళ్ళ భద్రయ్య, రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు సారంగపాణి, బి సి వెల్ఫేర్ శాఖా ఉద్యోగులు సరిత, మానస, సాడలు, కుమారస్వామి, ప్రతాప్, మరియు నాల్గోవ తరగతుల ఉద్యోగులు పాల్గొన్నారు.

# గెల్లి అప్పారావు మరణం మిల్లర్స్ సమాజానికి తీరనిలోటు

సూర్యాపేట జిల్లా బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 10:

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రైస్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, సెక్రటరీగా పనిచేసి నియోజకవర్గ కేంద్రంలో రైస్ మిల్లుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, కార్మికుల పక్ష పాతిగా,కార్మికులకు ఎనలేని సేవలను అందించిన మహనీయుడు గెల్లి అప్పారావు. వ్యాపారవేత్తగా ఆయన వ్యాపారాలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించడంతోపాటు, సామాజిక సేవలో కూడా నియోజకవర్గ కేంద్రంలో ముందుండి నిలబడి వాసవి క్లబ్ అధ్యక్షునిగా కూడా సమాజ శ్రేయస్సుకు ఎంతో కృషి చేశారు. సాయం కోసం తన వద్దకు వచ్చిన వారికి లేదనకుండా సాయం చేయడంలో వెనకాడని మహనీయుడు గెల్లి అప్పారావు. బుధవారం ఉదయం హార్ట్ స్ట్రోక్ తో ఆయన స్వర్గస్తులవడంతో హుజూర్ నగర్ నియోజకవర్గ ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు పొలిశెట్టి లక్ష్మి నరసింహారావు, ఓరుగంటి నాగేశ్వరరావు గజ్జి ప్రభాకర్ గెల్లి రంగారావు విద్యాసాగర్ బోనాల సాగర్ మట్టపల్లి వెంకటనారాయణ కొత్త శ్రీనివాసరావు కనక మర్ల పూడి మురళి మట్టపల్లి శ్రీమన్నారాయణ బూరుగు శ్రీనివాసరావు పెండ్యాల నాని తన్నీరు మల్లికార్జున్ నూనె యాదగిరి తదితరులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



మరణించిన తరువాత కూడా నేత్రదానం చేసిన మహనీయుడు

అన్ని దానాల కన్నా నేత్రదానం మిన్న అని నానుడిని అక్షరాల పాటిస్తూ తాను వ్యాపారవేత్తగా వ్యాపార అభివృద్ధి కార్మికుల సంక్షేమంతో పాటు సమాజానికి సేవ చేయడమే కాకుండా తన మరణాంతరం తన కంటిని దానం చేసిన మహోన్నతుడు గెల్లి అప్పారావు. వాసవి క్లబ్- వాసవి వనిత క్లబ్ లెజెండ్ హుజూర్ నగర్ ఆధ్వర్యంలో డైమండ్ నేత్ర నిధికి గెల్లి అప్పారావు నేత్రాలను కుమారుడు గెల్లి రవి దానం చేశారు.

# ఐలమ్మ జీవితం ఆదర్శం: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10

వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు సాధించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఐలమ్మ 40వ వర్దంతి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూల మాల వేసి నివాళర్పించారు.

తొలి భూ పోరాటానికి సామాజిక న్యాయానికి నాంది పలికిన ధైర్యశాలి, వీరనారి చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఎన్నో ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న ఐలమ్మ వీరత్వాన్ని ప్రతి ఒకరూ ఉద్యమ స్ఫూర్తిగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో నడవాలన్నారు.



## పది రోజులపాటు మిషన్ శక్తి స్కీం క్రింద మహిళా సాధికారత సంకల్ప్ ప్రోగ్రామ్

కడప, భారత శక్తి ప్రతినిధి, సెప్టెంబర్ 10:





మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, డైరెక్టర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి మరియు సాధికారత అధికారిణి శ్రీమతి పి.రమాదేవి, వై యస్. ఆర్ కడప జిల్లా వారు మిషన్ శక్తి స్కీం క్రింద మహిళా సాధికారత–సంకల్ప్ పది రోజులపాటు నిర్వహిస్తారు. ప్రోగ్రాం లో భాగంగా జిల్లా స్థాయిలో సిడిపివో లు, సూపర్వైజర్ లకు మిషన్ శక్తి పథకం యొక్క ప్రముఖ్యతను వన్ స్టాప్ సెంటర్ ద్వారా పబ్లిక్ మరియు ప్రైవేట్ భహిరంగా ప్రదేశాలల్లో మానసిక–శారీరక హింసకు గురైన మహిళలకు ఉచిత0గా వైద్య సహాయం, మానసిక మద్దతు, న్యాయ సలహాలు, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి కల్పిస్తారని జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్,ఎన్. శోభారాణి తెలిపారు.

మిషన్ వాత్సల్య పథకం %–% దత్తత కావలసిన వారు చట్టబద్ధంగా తీసుకోవాలని , భాల్య వివాహాలు, పోక్సో చట్టము, గృహహింసా విభాగం, ప్రీ మ్యారిటల్ కౌన్సిలింగ్ సెంటర్ గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమమును ఉద్యేసించి శ్రీమతి రమాదేవి, పీడీ మాట్లాడుతూ 181 ఉమెన్స్ హెల్ప్ లైన్, 112 హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విపులంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమములో సిడిపిఓలు – సునీత, శ్రీలత, శ్రీదేవి, డిసిపిఓ,డివిసి, మిషన్ వాత్సల్య, సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి

### -మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



కడప / యర్రగుంట్ల, సెప్టెంబర్ 10(భారత శక్తి) :

సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. కడప జిల్లా యర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో ఎస్సి బాయ్స్ హాస్టల్ లో మంత్రి డా.స్వామి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రూ.44 లక్షలతో హాస్టల్ లో మరమ్మతులు చేసినందుకు గాను సీఎం చంద్రబాబు, మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా హాస్టల్ ప్రాంగణంలో రేకులతో రూవ్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సంబంధిత శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ పేర్లతో హాస్టల్లో బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు.

## వైద్యంలో రసాయన, జీవశాస్త్రాల పాత్రపై చర్చా గోష్టి



నంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 10 :

రసాయన, జీవ శాస్త్రాల పాత్ర' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లో బుధవారం చర్చాగోష్ఠిని నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలను ఒకచోట చేర్చి, వైద్య శాస్త్రాన్ని అభివృద్ధి చేయడంలో, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో రసాయన, జీవ శాస్త్రాల యొక్క పరివర్తన పాత్రను అన్వేషించడానికి వీలు కల్పించారు. ఫ్రాన్స్ లోని రెన్నెస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, సీఎన్ఆర్ఎస్ రీసెర్చ్ డైరెక్టర్ ఎమిరిటస్ ప్రొఫెసర్ రెనే గ్రీ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 'పరిశోధనలో ఆవిష్కరణ యొక్క కీలక పాత్ర' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేశారు. శాస్త్రీయ ఆవిష్కరణలో కాకతాళీయంగా కలిసొచ్చిన అదృష్టం (సెరెండిపిటీ), ఉత్సుకత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, శాస్త్రీయ పరిశోధనకు ఫ్రాన్స్ లోని పరిశోధనావకాశాలను వివరించారు. బయోమెడికల్ పరిశోధన, మానవ ఆరోగ్య సంరక్షణలో దాని సామర్థ్యాన్ని నొక్కిచెప్పే సీఎల్ కే కినేస్ ల నూతన, అత్యంత ఎంపిక చేసిన నిరోధకం అయిన డీబీ18 ఆవిష్కరణపై ప్రొఫెసర్ గ్రీ లోతైన అవగాహన కల్పించారు. ఐఐసీటీ మాజీ డైరెక్టర్, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ అతిథులను స్వాగతించగా, పై ల్యాబ్స్ కు చెందిన డాక్టర్ ప్రథమ మాట్లాడుతూ, పరిశోధకులతో చురుకుగా సంభాషించాలని, సైన్స్ ను కెరీర్ మార్గంగా ఎంపిక చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కొత్త ఆహార అభివృద్ధి, కాలుష్య కారకాల పర్యవేక్షణ' అనే అంశంపై సీసీఎంబీలోని బయాలజీ శాస్త్రవేత్త డాక్టర్ లాబన్యావెూయ్ కోల్ ప్రసంగించారు. 'సుస్థిర సమాజం కోసం స్టీరియో కెమిస్ట్రీ, సింథటిక్ పద్ధతుల అభివృద్ధి ప్రభావం' అనే అంశంపై హైదరాబాదు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ.కె.సాహూ ఉపన్యసించారు. గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అనంత రామకృష్ణ తన దృక్పథాలను ఆన్ లైన్లో పంచుకున్నారు. గీతంలో నెలకొల్పిన అత్యాధునిక ప్రయోగశాలలను అతిథులంతా సందర్శించి, అక్కడ పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లతో సంభాషించారు.

స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, ఫుడ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నిహారిక పరిశోధనా సౌకర్యాల ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులు, సహ–నిర్వాహకులు ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల, డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ శివకుమార్ ఇందులో అతిథులుగా పాల్గొన్న, దీనిని సద్వినియోగం చేసుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రశంసా పత్రాల పంపిణీతో ముగిసిన ఈ సెమినార్ లో దాదాపు 150 మంది విద్యార్థులు, 20 మంది పరిశోధనా స్కాలర్లు పాల్గొని అత్యాధునిక శాస్త్రీయ పురోగతిపై లోతైన అవగాహనను ఏర్పరచుకున్నారు.

## బాసరలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన మంత్రి జూపల్లి ఎంపీ గోడం నగేష్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 10 :

బాసరలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుమారు రూ.5.75 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆసుపత్రి పూర్తయితే బాసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మంత్రి జూపల్లి భారీ వర్షాల వల్ల బాసర పరిసరాల్లో నష్టపోయిన పంట చేనులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట వివరాలు, పెట్టుబడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు తప్పక నష్టపరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వివరాలు, నివేదికలు త్వరితగతిన అందజేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, డీఎంహెచ్వో రాజేందర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి జూపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,సెప్టెంబర్ 10 ( భారత శక్తి) :



బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత ఆయన మహంకాళి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. అనంతరం మంత్రి జూపల్లి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులతో సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.190 కోట్ల వ్యయంతో బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో చర్చించి బాసర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాసరను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖలతో సమన్వయం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజనా దేవి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయి

### -పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, సెప్టెంబర్ 10(భారతశక్తి) : జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సరిపడా యూరియా నిల్వలు ఉష్కళంగా ఉన్నాయని ప్రణాళికా బద్ధంగా పంపిణీ కార్యక్రమం సాగుతోందని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ లోని విసి హాలులో జిల్లాలో యూరియా నిల్వలు, పంపిణీపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ కమ జెసి జెసి అతిథి సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అక్రమంగా విక్రయించడం లేదా ఇతర అవసరాలకు మళ్లించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. జిల్లాలో లక్షా ఎకరాల్లో వారి సాగుబడి ప్రణాలికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా కేసి ఆయకట్టు పరిధిలో 45 వేల ఎకరాల్లో వరి పంట విస్తారంగా సాగులో ఉందని, మరో నెల రోజుల్లో సాగు విస్తృతి 80 వేల ఎకరాలకు పెరగనుందన్నారు. సాగులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది 3 వారాల ముందే సరిపడా వర్షపాతం నమోదు కావడంతో కేసి, బ్రహ్మంసాగర్ ఆయకట్టులో రైతులు ఉత్సాహంగా వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఇప్పటికే 12,800 మెట్రిక్ టన్నుల యూరియాను ఆయా ప్రాంతాల రైతు సేవ కేంద్రాలు, సంబందిత డీలర్ల ద్వార అందించామన్నారు. మరో వారంలో వారంలో 50 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి రానుందన్నారు. జిల్లా రైతాంగానికి సరిపడా యూరియాను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అయితే శాస్త్రీయ పరంగా రైతులు ఒక ఎకరాకు ఒకటి లేదా ఒకటిన్నర బస్తాను మాత్రమే మూడు విడతలుగా వాడాల్సివుందని తెలిపారు. అధిక మోతాదులో యూరియాను వినియోగించడం వల్ల అనేక అనర్థాలు ఎదురయ్యే అవకాశాలున్నాయన్నారు. అయితే ఇప్పటికే రైతులు ఎకరాకు 2–3 బస్తాలు వినియోగించడం జరిగిందన్నారు. మరి కొందరు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టించవద్దని రైతులకు తెలియజేస్తూ సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. కావున జిల్లా రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం ఉందన్నారు. మన జిల్లాలో ఇప్పటివరకు మన జిల్లాలో యూరియా కొరత ఉందనే విషయం ఎక్కడా జరగలేదు. గత మూడు రోజులుగా 1300 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించడం జరిగిందన్నారు యూరియా అనేది కేవలం నత్రజనిని మాత్రమేనిచ్చే కంపోనెంట్ అని.. యూరియాని సమతుల్య స్థాయిలోనే వాడాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఎరువులను ఎన్ని ఎకరాలకు ఎంత మోతాదు వాడాలి అనే అంశంపై క్షేత్ర స్థాయిలో రైర్పులకు అవగాహన కల్పించడం. జరుగుతోందన్నారు. కాగా జిల్లాలో యూరియా, సంబందిత ఎరువులకు ఎలాంటి కొరత లేదన్నారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే ఎరువులను రైతులకు విక్రయించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మరో వారం తర్వాత ఉల్లి పంటలు సాగులోకి రానున్నాయన్నారు. ప్రస్తుతం చీనీ పంట చివరి శదలో ఉందన్నారు. చీనీ పంట మార్కెటింగ్ విషయంలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. గత రెండు నెలలుగా అనఫిషల్ సూట్ అనేది జిల్లా మార్కెటింగ్ నుండే తొలగించడం జరిగిందన్నారు. రైతులు గ్రేడింగ్ మంచిగా చేసి యాక్షన్ చేస్తే మార్కెట్ లో మంచి డిమాండ్ తోపాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేక సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికాబద్ధంగా ఎరువులు, విత్తనాల పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షించడం జరుగుతొందన్నారు. యూరియా కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వచ్చే వదంతలను నమ్మవద్దని, అలాంటి తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల పంపిణీ సమయంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం నుండి అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రా నాయక్, ఎపి మార్క్ ఫెడ్ డిఎం పరిమళ జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నగరంలో రోడ్ల నిర్వహణ, రోడ్డు భద్రతా చర్యలు అభినందనీయం

* **జిహెచ్ఎంసీకి సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ ప్రశంస**






హైదరాబాద్, (భారత శక్తి) సెప్టెంబర్ 10: హైదరాబాద్ నగరంలో రోడ్ల నిర్వహణ, రోడ్డు భద్రతా చర్యలు అభినందనీయమని జిహెచ్ఎంసీని సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ (SCCoRS) చైర్మన్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ప్రశంసించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతా చర్యల అమలులో కార్పొరేషన్ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం నగరంలోని బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హోటల్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ (SCCoRS) చైర్మన్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ డా. జితేందర్, పురపాలక కార్యదర్శి ఇలంబరితి, జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, హెచ్ఎండిఏ, రవాణా శాఖ, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇతరుల ప్రాణాలను మనం కాపాడితే, భగవంతుడు మన ప్రాణాలను కాపాడతాడు అనే భగవద్గీత లోని ఓ వాక్యాన్ని సమావేశంలో చైర్మన్ ప్రస్తావించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో ఎవ్వరూ చనిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో పలు శాఖలు రోడ్డు భద్రతా చర్యలపై తమ శాఖ తీసుకున్న చర్యలను వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమాలను జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చైర్మన్ కు వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు, ప్రయాణికులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు నగరంలో 1,687.76 కి.మీ రోడ్లపై లేన్ మార్కింగ్, 3,949 జీబ్రా క్రాసింగ్స్, 3,453 ప్రదేశాల్లో అడ్డ బార్ గుర్తులు, 3,335 సైన్‌బోర్డులు ఏర్పాటు చేశామనీ కమిషనర్ తెలిపారు. ప్రధాన రోడ్లలో ప్రతి సంవత్సరానికి ఒకసారి లేని మార్కింగ్ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. పాదచారుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నగరంలో 212.71 కి.మీ మేర కొత్తగా ఫుట్‌పాత్‌లు వేయడం, మరమ్మత్తులు చేపట్టామన్నారు. 23 ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణం చేపట్టి ఇప్పటికే 15 పూర్తి చేశామన్నారు. 50 కూడళ్ల అభివృద్ధి పనులు ఇప్పటి వరకూ పూర్తి చేశామన్నారు. నగరవ్యాప్తంగా 92 బ్లాక్ స్పాట్లను గుర్తించి ఇప్పటికే 75 బ్లాక్ స్పాట్ లలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టమన్నారు. రోడ్డు భద్రతా డ్రైవ్ లో భాగంగా జూలై 2025 నుంచి ఇప్పటివరకు 1,442 గుంతలు పూడ్చివేసి, 574 క్యాచ్‌పిట్ మరమ్మతులు, 328 క్యాచ్‌పిట్ కవర్లు మార్చడం, 12 సెంట్రల్ మీడియన్ పనులు పూర్తిచేశామన్నారు. గత, ప్రస్తుతం ఆర్థిక సంవత్సరాల్లో రోడ్డు నెట్వర్క్ బలోపేతం పై దృష్టి పెట్టామని కమిషనర్ చెప్పారు అబిడ్స్, ఎంజే మార్కెట్, ఖైరతాబాద్, టోలిచౌకీ ఫ్లైఓవర్, సనత్‌నగర్, మాధాపూర్, సికింద్రాబాద్, సైదాబాద్ ప్రాంతాల్లో తారు , సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని కమిషనర్ ఆర్ వి కర్ణన్ చైర్మన్ కు నివేదించారు. కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం చైర్మన్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే, జిహెచ్ఎంసీ రోడ్డు భద్రతా చర్యలను అభినందిస్తూ, ప్రమాదాల నివారణలో అన్ని శాఖలూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

## జాతీయ లోక్ అదాలత్ ను అందరు సద్వినియోగం చేసుకోవాలి



ఎల్బీనగర్, సెప్టెంబర్ 10, (భారత శక్తి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్ణ కుమార్ ప్రజలందరికి ముఖ్య గమనిక తెలియజేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 13న (రెండవ శనివారం) రోజున రంగారెడ్డి జిల్లా లోని అన్ని కోర్టులలో లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుంది. ఇది వరకు కోర్ట్ ముందుకు రాని కేసులు కానీ కోర్ట్ లందు పెండింగ్ లో ఉన్న కేసులు కానీ పరిష్కరించుకునే/రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్.లోక్ అదాలత్లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. న్యాయస్థానంలో పెండింగ్లో ఉన్న కేసు లోక్ అదాలత్ కు పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే, వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుంది. ఈ లోక్ అదాలత్ ల ద్వారా సమయం,డబ్బు వృధా కాకుండా ఉంటుంది.ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులుమోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు ఇతర రాజీకి వీలున్న కేసులు పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి శ్రీ వాణి పిలుపునిచ్చారు.



## ట్రంక్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయండి : సుధీర్ రెడ్డి

* **మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

ఎల్బీనగర్, సెప్టెంబర్ 10 (భారత శక్తి): ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మెట్రో వాటర్ వర్క్స్ ఎండి.అశోక్ రెడ్డిని వారి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.బి.ఎన్.రెడ్డి నగర్, మన్సూరాబాద్,హయత్ నగర్ డివిజన్ల పరిధిలో ప్రధానంగా ఎదుర్కొంటున్న ట్రంక్ లైన్స్ సమస్యల గురించి పలు కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో పలు సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా సాగర్ కాంప్లెక్స్ మీద నుంచి వచ్చే డ్రైన్స్ నీరు గుర్రంగూడ ఫారెస్ట్, హరిహారపురం కాలనీలోకి రావడం జరుగుతున్న నేపథ్యంలో ఫారెస్ట్ నందు రెండు చెరువుల కూపంగా కావడం జరిగిన నేపథ్యంలో ఫారెస్ట్ లో మురికినీరు చేరి దోమలు రావడం జరుగుతుందని అన్నారు. ఫారెస్ట్ మురికి కూపంగా మారుతుండడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారు ఫారెస్టును నాశనం చేస్తున్నారని ట్రంక్ పనులు ఆపడం జరిగిందని, యుద్ధప్రాతిపదికన సాగర్ కాంప్లెక్స్ కల్వర్టు నుంచి అలాగే హరిహారపురం కాలనీ దగ్గర ఉన్న డ్రైనేజీ ఛాంబర్ వద్ద కలపడానికి షార్ట్ టెండర్ ఏర్పాటు చేసి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు.దానికి వారు వెంటనే స్పందించి 17 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.అందుకు కాలనీ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.అలాగే మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతి రెసిడెన్సీ వద్ద దాదాపు మూడు నెలల క్రితం ఆగిపోయిన ట్రంక్ లైన్స్ పనులు వెంటనే ప్రారంభం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన కమిషనర్ రెండు,మూడు రోజుల్లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభం చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టి షార్ట్ టెండర్ వేయించి 15 రోజుల్లో పనులు ప్రారంభం చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే హయత్ నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీప్రియ కాలనీ,దుర్గ నగర్, వెంకటేశ్వర కాలనీ,పీ&టీ కాలనీ,రాజేశ్వరి కాలనీ,మైత్రి విల్లాస్ తదితర కాలనీలకు ట్రంక్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని కాలనీలు శివారు ప్రాంతాల్లో ఇండ్లు పెరిగి జనాలకు మంచినీరు సరిపోవడం లేదని మంచినీరు తక్కువగా వస్తున్న ప్రాంతాల్లో మంచినీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనిపై మెట్రో వాటర్ వర్క్స్ ఎం.డి.అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి ఎం.డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కటికరెడ్డి అరవింద్ రెడ్డి,జక్కిడి రఘువీర్ రెడ్డి,సందడి సందీప్ రెడ్డి,సాగర్ కాంప్లెక్స్ ఫేస్.1 అధ్యక్షులు కృష్ణరెడ్డి,సాగర్ కాంప్లెక్స్ ఫేస్.2 అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సిరిపురం కాలనీ అధ్యక్షులు ముత్యంరావు, వినూత్న కాలనీ అధ్యక్షుడు నరేన్ రెడ్డి,గాంధీ నగర్ సౌత్ అధ్యక్షులు కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యంలో రసాయన, జీవశాస్త్రాల పాత్రపై చర్చాగోష్ఠి

* **ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్ ప్రొఫెసర్ రెనే గ్రీ**
* **సెమినార్ ను ప్రారంభించిన ఐఐసీటీ పూర్వ డైరెక్టర్**





పటాన్‌చెరు, సెప్టెంబర్ 10 (భారత శక్తి) : 'వైద్యానికి సంబంధించిన పదార్థాలు: రసాయన, జీవ శాస్త్రాల పాత్ర' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లో బుధవారం చర్చాగోష్ఠిని నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలను ఒకచోట చేర్చి, వైద్య శాస్త్రాన్ని అభివృద్ధి చేయడంలో, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో రసాయన, జీవ శాస్త్రాల యొక్క పరివర్తన పాత్రను అన్వేషించడానికి వీలు కల్పించారు. ఫ్రాన్స్ లోని రెన్నెస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, సీఎన్ఆర్ఎస్ రీసెర్చ్ డైరెక్టర్ ఎమిరిటస్ ప్రొఫెసర్ రెనే గ్రీ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 'పరిశోధనలో ఆవిష్కరణ యొక్క కీలక పాత్ర' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేశారు. శాస్త్రీయ ఆవిష్కరణలో కాకతాళీయంగా కలిసొచ్చిన అదృష్టం (సెరెండిపిటీ), ఉత్సుకత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, శాస్త్రీయ పరిశోధనకు ఫ్రాన్స్ లోని పరిశోధనావకాశాలను వివరించారు. బయోమెడికల్ పరిశోధన, మానవ ఆరోగ్య సంరక్షణలో దాని సామర్థ్యాన్ని నొక్కిచెప్పే సీఎల్ కే (CLK) కినేస్ ల నూతన, అత్యంత ఎంపిక చేసిన నిరోధకం అయిన డీబీ18 ఆవిష్కరణపై ప్రొఫెసర్ గ్రీ లోతైన అవగాహన కల్పించారు. ఐఐసీటీ మాజీ డైరెక్టర్, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ అతిథులను స్వాగతించగా, పై ల్యాబ్స్ కు చెందిన డాక్టర్ ప్రథమ మాట్లాడుతూ, పరిశోధకులతో చురుకుగా సంభాషించాలని, సైన్స్ ను కెరీర్ మార్గంగా ఎంపిక చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. 'కొత్త ఆహార అభివృద్ధి, కాలుష్య కారకాల పర్యవేక్షణ' అనే అంశంపై సీసీఎంబీలోని బయాలజీ శాస్త్రవేత్త డాక్టర్ లాబన్యామోయ్ కోల్ ప్రసంగించారు. 'సుస్థిర సమాజం కోసం స్టీరియో కెమిస్ట్రీ, సింథటిక్ పద్ధతుల అభివృద్ధి ప్రభావం' అనే అంశంపై హైదరాబాదు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ.కె.సాహూ ఉపన్యసించారు. గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అనంత రామకృష్ణ తన దృక్పథాలను ఆన్ లైన్లో పంచుకున్నారు. గీతంలో నెలకొల్పిన అత్యాధునిక MURTI ప్రయోగశాలలను అతిథులంతా సందర్శించి, అక్కడ పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లతో సంభాషించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, ఫుడ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నిహారిక పరిశోధనా సౌకర్యాల ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులు, సహనిర్వాహకులు ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల, డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ శివకుమార్ ఇందులో అతిథులుగా పాల్గొన్న, దీనిని సద్వినియోగం చేసుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రశంసా పత్రాల పంపిణీతో ముగిసిన ఈ సెమినార్ లో దాదాపు 150 మంది విద్యార్థులు, 20 మంది పరిశోధనా స్కాలర్లు పాల్గొని అత్యాధునిక శాస్త్రీయ పురోగతిపై లోతైన అవగాహనను ఏర్పరచుకున్నారు.



## కూకట్పల్లిలో 1.20, ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన హైడ్రా

* **రూ. వంద కోట్ల విలువైన భూమికి కంచె నిర్మాణం**



హైదరాబాద్, సెప్టెంబరు 10, (భారత శక్తి) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి గ్రామం సర్వే నంబరు 276లో 1.20 ఎకరాల భూమిని బుధవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుంది. ఆల్విన్ కాలనీకి ఆనుకుని ఉన్న 276 సర్వే నంబరులో 2.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇప్పటికే కొన్ని ఇళ్లు నిర్మాణం జరిగాయి. ఇంకా మిగిలి ఉన్న 1.20 ఎకరాల భూమి కబ్జా కాకుండా హైడ్రా కాపాడింది. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ కంచె వేసింది. అయితే ఈ భూమి తమదంటూ హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ పోరాడుతోంది. ఇదే సమయంలో ఆల్విన్ కాలనీ సంక్షేమ సంఘంతో పాటు ఆ పక్కనే ఉన్న కాకతీయనగర్ కాలనీ వాసులు మాత్రం ఈ భూమిని కాపాడి.. పార్కును నిర్మించాలని లని డిమాండ్ చేస్తున్నారు. ఎవరి డిమాండ్లు ఎలా ఉన్నా.. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవ్వకుండా హైడ్రా ఫెన్సింగ్ వేయడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజావాణి ఫిర్యాదుల మేరకు, హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీకి 1986లో ప్రభుత్వం 79.29 ఎకరాల స్థలాన్ని ఇచ్చింది. రెండు దశల్లో ప్లాట్ల కేటాయింపు జరిగింది. ఇంకా ఇల్లు రానివారు కొంతమంది ఉన్నారంటూ పక్కనే ఉన్న 2.39 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు డబ్బులు కూడా చెల్లించినట్టు కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు. కమిటీ ప్రతినిధులు కొనకుండానే 2.39 ఎకరాల్లో ప్లాట్లు వేసి అక్రమంగా అమ్మారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆల్విన్ కంపెనీ బంద్ అయ్యింది. ఇంకా ఆ కమిటీ మనుగడలో లేదని.. ఆల్విన్ కాలనీలోని ప్లాట్లు కూడా ఇష్టానుసారం అమ్మేశారని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి ఖాళీ స్థలంలో అక్రమ పార్కింగ్ కొనసాగుతోందని.. దీంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను విచారించిన హైడ్రా.. సర్వేనంబరు 276లో ఉన్నది 2.39 ఎకరాలు ప్రభుత్వ స్థలమే అని నిర్ధారించింది. ఇప్పటికే కొన్ని ఇళ్లు రాగా.. మిగిలి ఉన్న 1.20 ఎకరాల స్థలాన్ని కాపాడి బుధవారం ఫెన్సింగ్ వేసింది.

# నాది, పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటే : ముఖ్యమంత్రి చంద్రబాబు

* మనం పాలకులు కాదు, ప్రజలకు సేవకులం
* సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కామన్ మ్యాన్
* అహంకారం, అవినీతి, అలసత్వం దరికి రానివ్వొద్దు
* నాది, పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటే
* రాష్ట్రానికి ప్రధాని మోదీ అన్ని విధాలా అండగా ఉన్నారు
* సంక్షేమం, అభివృద్ధి రెండూ సూపర్ హిట్ చేస్తాం
* 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభలో చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 10 (భారత శక్తి) :** "మనం పాలకులం కాదు, ప్రజలకు సేవకులం. ముఖ్యమంత్రి అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కామన్ మ్యాన్" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులకు, కార్యకర్తలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. దర్జాలు, ఆర్భాటాలు ప్రదర్శించడం కుదరదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అహంకారం, అవినీతి, అలసత్వం వంటివి దరిచేరనివ్వొద్దని గట్టిగా సూచించారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభలో ఆయన మాట్లాడుతూ, తన ఆలోచన, మిత్రపక్ష నేత పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటేనని, రాష్ట్ర పునర్నిర్మాణం, ప్రజలకు న్యాయం చేయడమే తమ ఏకైక ధ్యేయమని స్పష్టం చేశారు. "మాకు ఈ ధ్యాస తప్ప వేరే ధ్యాస లేదు. ప్రజల భవిష్యత్తే మాకు ముఖ్యం" అని ఆయన అన్నారు. ఒక ఎమ్మెల్యే, కార్యకర్త లేదా అధికారి తప్పు చేసినా, ఆ చెడ్డపేరు ప్రభుత్వానికే వస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి మంచి చేయాలనే తమ సంకల్పానికి కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సహకారానికి ప్రధానమంత్రి మోదీకి ఆయన వేదికగా ధన్యవాదాలు తెలియజేశారు. మూడు పార్టీల కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పాలన అందిస్తామని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఐకమత్యంతో కలిసికట్టుగా ఉంటేనే బలం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం కోసం తన శక్తిమేర శ్రమిస్తానని, 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' సాధనే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సూపర్ హిట్ అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. "వైకుంఠపాళి ఆట వద్దు. నిరంతర పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ 1 స్థానానికి తీసుకెళ్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తాను 47 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యానని చంద్రబాబు అన్నారు. రామరాజ్యం లాంటి పాలన ఇచ్చే బాధ్యత తనది, పవన్ కల్యాణ్‌ది అన్నారు. ప్రజల కోసం పని చేస్తున్నామని, అన్నీ చేస్తామని, సహకారం కావాలని కోరారు. కలిసి పోటీ చేశాం.. కలిసి గెలిచాం.. కలిసి పని చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రజల దీవెనలతో ఈ హిట్ కాంబినేషన్ కొనసాగుతోని అన్నారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే'.. ఈసీ

(మొదటి పేజీ తరువాయి)

బీహార్ లో ఇటీవల ఈ సర్వే చేపట్టి ఓటర్ జాబితాలో పెద్ద సంఖ్యలో అనర్హులను తొలగించిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు ఈ సర్వే చేపట్టడంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. దీనిపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, ఈసీ చర్య రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం సమర్థించింది. రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులతో జరగనున్న సమావేశంలో ఈసీ సీనియర్ అధికారులు ఎస్ఐఆర్‌పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. బీహార్ లో ఈ విధానాన్ని అమలు చేసిన తీరును ఆ రాష్ట్ర ఎన్నికల అధికారి వెల్లడించనున్నారు. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. వచ్చే ఏడాది తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివర్లోనే దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో సహాయక కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల బృందానికి అప్పగించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం తెలిపింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మాండ్‌లోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వాసులు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్, ప్రైవేట్ సెక్రటరీ అండ్ లైజన్ హెడ్ +91 9871999044, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ +91 9643723157, హెచ్ చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి +91 9949351270.

## క్షమించరాని తప్పు చేశారు బీఆర్ఎస్ పై రేణుకా చౌదరి ఫైర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (భారత శక్తి) :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరుగుతున్నందునే, ఆ భయంతో బీఆర్ఎస్ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. వారి చర్య ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, ఇది క్షమించరాని తప్పిదమని ఆమె అన్నారు. ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియపై ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ ఓటింగ్‌కు గైర్హాజరు కావడం ద్వారా భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందని రేణుకా చౌదరి మండిపడ్డారు. రాజకీయాల్లో గెలుపోటములు అనేవి కేవలం నంబర్లకు సంబంధించిన విషయమేనని, కానీ రాజ్యాంగబద్ధమైన ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటం మాత్రం చాలా పెద్ద తప్పిదమని ఆమె పేర్కొన్నారు. భారత ఉప రాష్ట్రపతిగా ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయన ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మొత్తం 13 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు, బీజేడీకి చెందిన ఏడుగురు, అకాలీదళ్ నుంచి ఒకరు, ఒక ఇండిపెండెంట్ సభ్యుడు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ తీరుపై రేణుకా చౌదరి ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ఏడాదిలో 15 రోజులు మాత్రమే తెరుచుకునే రైల్వే స్టేషన్... పితృ దేవతల కోసం ప్రత్యేకం!

* పున్‌పున్ నదీ తీరంలో పిండ ప్రదానాల కోసం ఈ సౌకర్యం
* ఈ నెల 21 వరకు 8 జతల రైళ్లు ఈ స్టేషన్‌లో ఆగుతాయి
* ఇక్కడ టికెట్ కౌంటర్ ఉండదు, గయా టికెట్‌తోనే ప్రయాణం



**బీహార్, సెప్టెంబర్ 10:** మన దేశంలో వేల సంఖ్యలో రైల్వే స్టేషన్లు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. కానీ, బీహార్‌లో ఓ రైల్వే స్టేషన్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. అది సంవత్సరంలో కేవలం 15 రోజులు మాత్రమే పనిచేస్తుంది. మిగతా రోజులన్నీ మూసి ఉంటుంది. పితృ పక్షం సందర్భంగా పితృదేవతలకు పిండ ప్రదానం చేసే వారి సౌకర్యార్థం భారతీయ రైల్వే ఈ ప్రత్యేక స్టేషన్‌ను తాత్కాలికంగా నిర్వహిస్తోంది. బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో ఉన్న అనుగ్రహ నారాయణ్ రోడ్ ఘాట్ స్టేషన్ ఇదే. ప్రతి ఏటా పితృ పక్షం రోజుల్లో మాత్రమే ఈ స్టేషన్‌ను తెరుస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 7న పితృ పక్షం ప్రారంభం కావడంతో ఈ స్టేషన్ కార్యకలాపాలు మొదలయ్యాయి. స్టేషన్ సమీపంలో ప్రవహించే పున్‌పున్ నది తీరంలో ప్రజలు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు, తర్పణాలు సమర్పిస్తారు. గంగా నది కంటే పురాతనమైనదిగా భావించే ఈ నదిని 'ఆదిగంగ పున్‌పున్' అని కూడా పిలుస్తారు. ఈ 15 రోజుల పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి తరలివస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ సెంట్రల్ రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సెప్టెంబర్ 21 వరకు దాదాపు 8 జతల ప్యాసింజర్ రైళ్లు ఈ స్టేషన్‌లో ఆగుతాయని అధికారులు తెలిపారు. ఈ స్టేషన్ మరో ప్రత్యేకత ఏంటంటే ఇక్కడ టికెట్ కౌంటర్ ఉండదు. పిండ ప్రదానాల కోసం వచ్చేవారు సమీపంలోని గయా స్టేషన్ వరకు టికెట్ కొనుగోలు చేస్తారు. పున్‌పున్ నదిలో కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తర్వాత, అదే టికెట్‌పై గయాకు ప్రయాణిస్తారు. కేవలం ఒక ధార్మిక కార్యక్రమం కోసం రైల్వే శాఖ ఒక స్టేషన్ ను ఏర్పాటు చేయడం గమనార్హం.

## హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్ రక్షణ భూముల కోసం రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

* రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల భూమి కేటాయించాలని కోరిన సీఎం
* మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణంపై చర్చ
* తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశంపైనా ప్రస్తావన

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (భారత శక్తి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఈరోజు ఆయన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమై, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అవసరమైన రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి బదలాయించాలని కోరారు. మహానగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరమని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్ కరీంనగర్ రామగుండంలను కలిపే రాజీవ్ రహదారిపై ప్యాకేజీ జంక్షన్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అత్యవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆ మార్గంలో ప్రయాణం సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన మెహదీపట్నం రైతుబజార్ వద్ద పాదచారుల సౌకర్యార్థం స్కై వాక్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికి కూడా కొంత రక్షణ భూమిని కేటాయించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో తెలంగాణలో కొత్తగా సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



## డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ కు కార్పొరేటర్ అభినందన..!

ఎల్బీనగర్, సెప్టెంబర్ 10 (భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సరూర్నగర్ జిహెచ్ఎంసి సర్కిల్ 5 నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన భువనగిరి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సరూర్నగర్ చెరువులో గణేష్ విగ్రహాల నిమజ్జనం 2025 కార్యక్రమాన్ని విజయవంతంగా, శాంతియుతంగా పూర్తి చేయడంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ వారి బృందం తీసుకున్న సమన్వయం, కృషి అభినందనీయమని తెలిపారు. ప్రజల సహకారం, సిబ్బంది శ్రమ వల్లే ఈ మహోత్సవం ప్రశాంతంగా పూర్తయిందని కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## యూకే కొరడా.. 20,000 మంది భారతీయుల భవితవ్యం ప్రశ్నార్థకం!

**బ్రిటన్, సెప్టెంబర్10:** బ్రిటన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. వీసా గడువు ముగిసినా తమ దేశాలకు తిరిగి వెళ్లని వారిని వెనక్కి తీసుకునే విషయంలో సహకరించని దేశాలపై ఉక్కుపాదం మోపాలని యూకే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, నైజీరియాలు ఉండటంతో, ఆయా దేశాల పౌరులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధించనున్నట్లు బ్రిటన్ కాబోయే హోం సెక్రటరీ (లేబర్ పార్టీ షాడో హోం సెక్రటరీ) యెవెట్ కూపర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అక్రమ వలసదారులను నియంత్రించడంలో భాగంగా బ్రిటన్ ప్రభుత్వం 'రిటర్న్స్' ఒప్పందాలను (తిరిగి పంపించే ఒప్పందాలు) కఠినంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం వీసా గడువు ముగిసిన లేదా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన తమ పౌరులను ఆయా దేశాలు తిరిగి వెనక్కి తీసుకోవాలి. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని దేశాలు సహకరించడం లేదని బ్రిటన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వీసా విధానాన్ని ఒక 'బేరసారాల అస్త్రంగా' వాడుకోవాలని కొత్త ప్రభుత్వం యోచిస్తోంది. ఒకవేళ భారత్ వంటి దేశాలు తమ పౌరులను వెనక్కి తీసుకోవడంలో జాప్యం చేస్తే తొలుత వీసా దరఖాస్తు రుసుములను భారీగా పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయాలని, చివరి అస్త్రంగా ఆ దేశ పౌరులకు తాత్కాలికంగా లేదా పూర్తిగా వీసాలను నిలిపివేయాలని యోచిస్తోంది.

### భారతీయులే అధికం

బ్రిటన్ హోం ఆఫీస్ గణాంకాల ప్రకారం వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోయిన వారిలో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 2020 నాటికే దాదాపు 20,706 మంది భారతీయులు ఈ జాబితాలో ఉన్నట్లు అంచనా. గత ఏడాది భారత్ సుమారు 7,400 మందిని వెనక్కి తీసుకున్నప్పటికీ, పాస్‌పోర్టులు లేని వారిని గుర్తించి, వారికి అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేయడంలో భారత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యూకే అధికారులు ఆరోపిస్తున్నారు.

### బెడిసికొట్టనున్న సంబంధాలు

బ్రిటన్ ఏకపక్షంగా తీసుకునే ఈ నిర్ణయం భారత్ వంటి కీలక భాగస్వామ్య దేశంతో ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన మైగ్రేషన్ అబ్జర్వేటరీ నిపుణుడు డాక్టర్ పీటర్ వాల్ష్ మాట్లాడుతూ "యూకే వీసా వ్యవస్థను అత్యధికంగా వినియోగించుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇటువంటి బెదిరింపు ధోరణిని భారత్ తేలిగ్గా తీసుకోదు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య, విద్యా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని అభిప్రాయపడ్డారు. కాగా, ఈ సమస్యను పరిష్కరించడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, అవసరమైతే ఏ దేశానికైనా వీసాలను ఆయుధంగా ప్రయోగించడానికి సిద్ధమని యెవెట్ కూపర్ స్పష్టం చేశారు. దీంతో బ్రిటన్‌లో చదువు, ఉద్యోగాల కోసం వెళ్లాలనుకుంటున్న లక్షలాది మంది భారతీయుల్లో ఆందోళన నెలకొంది.

# రెవెన్యూ శాఖలో మార్పు ఎప్పుడు..? రైతు రోదన తీరేది ఎప్పుడు..?

- అడుగడుగునా అవినీతి అధికారులే..
- అన్నం పెట్టే రైతుల కడుపు కొడుతున్నారు..
- ఎవరి భూమి ఎవరి పరం అవుతుందో తెలియని సంక్షోభం..
- అధికారులు ఒక వైపు, ప్రకృతి ఒకవైపు పగబడుతూనే ఉన్నారు..
- రైతును రాజును చేస్తామని చెప్పడం తప్ప ఒరగబెట్టింది ఏమీ లేదు..
- అధిక రాబడి రైతులకు కాదు.. రెవెన్యూ శాఖ అవినీతి అధికారులకు..
- సమస్య వస్తే రైతులను ముప్ప తిప్పలు పెడుతున్న దుర్మార్గం..
- అసలే అప్పుల్లో కూరుకుపోతున్న రైతన్న లంచాలివ్వగలడా..?
- అటు చావలేక, ఇటు బ్రతకలేక జీవచ్ఛవాల్లా మిగులుతున్నారు..
- రెవెన్యూ శాఖలో ప్రక్షాళన జరిగితే తప్ప రైతు బాగుపడడు..
- వందల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం..
- భూ యజమాని ఒకరైతే.. రికార్డుల్లో మరొకరి పేరు..
- రైతులకు ఉరిలా మారుతున్న అధునాతన పోర్టర్లు..
- రెవెన్యూ శాఖపై ప్రత్యేక దృష్టిపెట్టాలని డిమాండ్ చేస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (భారత శక్తి) :** తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ శాఖ అనే పేరు వినగానే ప్రజల్లో కలిగే భావన ఒక్కటే.. లంచం లేనిదే పని జరగదు. భూమి రికార్డులు, మ్యూటేషన్, పాస్బుక్, వారసత్వ హక్కులు.. ఇవన్నీ కాగితాలపైనే కాదు, అధికారుల జేబులపైనే ఆధారపడి పోతున్నాయి. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఈ శాఖే ఇప్పుడు సమస్యలకు మూలంగా మారింది.

*** రికార్డుల మాయాజాలం అంతా ఇంతా కాదు :**

భూమి రికార్డుల్లో తప్పుడు ఎంట్రీలు, అసలైన యజమానుల పేర్లు తొలగింపు, ధరణి పోర్టల్లో తప్పులు.. ఇవన్నీ రైతుల ప్రాణాధారమైన భూములను కబళించే అనకొండలు అయ్యాయి. తన భూమిపై హక్కు నిరూపించుకోవడానికి రైతు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి కలుగుతోంది..

**పెచ్చుమీరిన లంచాల సంస్కృతి :**

మ్యూటేషన్ చేయించుకోవాలా? పాస్బుక్ కావాలా? సర్వే చేయించుకోవాలా? ప్రతి అడుగుకూ లంచం తప్పనిసరి. "లంచం లేకుండా రెవెన్యూ శాఖలో పని జరగదు" అనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఇది ఒక విధంగా అధికారిక సత్యంలా మారింది.

**అక్రమ రిజిస్ట్రేషన్ల విష వలయం :**

ప్రభుత్వ భూములు, ఇనాం భూములు, దేవాదాయ భూములు.. ఈ భూముల్లో అక్రమార్కుల చేతుల్లో ఏవీ తప్పించుకోలేవు.. అక్రమ రిజిస్ట్రేషన్లతో కోట్ల రూపాయల భూములు అక్రమార్కుల ఖాతాల్లోకి జారిపోతున్నాయి.. దీనికి అధికారుల, మధ్యవర్తుల, రాజకీయ నాయకుల చేతులు కలిసిపోయాయి అన్నది నగ్న సత్యం.. బహిరంగంగా ప్రజల్లో కూడా ఇవే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రైతు దుస్థితి అలవికానిది :**

భూమి రికార్డులు తప్పుగా ఉండటంతో రైతు




పంట రుణం పొందలేకపోతున్నాడు. అప్పులు, కోర్టు కేసులు, ఆర్థిక ఇబ్బందులు.. ఇవన్నీ రైతు జీవితాన్ని దుస్థితిలోకి నెడుతున్నాయి. "భూమి మీద నాకున్న హక్కు నిరూపించుకోవడమే ఒక యుద్ధం" అంటున్నారు అనేకమంది రైతులు.

**మార్పు తప్పనిసరి :**

ఇక్కడ ఎదురవుతున్న ప్రశ్న ఒక్కటే.. ఈ దోపిడీకి అంతం లేదా..?

అవినీతి చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోగలగాలి.. గ్రామస్థాయిలో భూ రికార్డులను ఒక క్రమ పద్ధతిలో క్షుణ్ణంగా ఎలాంటి తారతమ్యాలు లేకుండా తనిఖీ చేయాలి. ఒకప్పటి ధరణి ఇప్పటి బిల్డ్ నౌ లాంటి ఆన్లైన్ వ్యవస్థలను పారదర్శకంగా, బలోపేతం చేయాలి. రాజకీయ జోక్యాన్ని పూర్తిగా అరికట్టాలి..

రైతు కన్నీటిని తుడవడం, ప్రజల భూమికి భద్రత కల్పించడం ప్రభుత్వానికి పెద్ద సవాలు. రెవెన్యూ శాఖలో మార్పు రాకపోతే, అది కేవలం రైతుకే కాదు, తెలంగాణ సమాజానికే ఒక పెద్ద దెబ్బగా మిగిలిపోతుందని హెచ్చరిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "...





# కంటికి ఇంపుగా.. ముక్కుకు సొంపుగా!

- * తిన్నోడికి తిన్నంతా రోగం
- * కెమికల్స్ తో కలర్ ఫుల్ వంటకాలు
- * పుట్టగొడుగుల్లా పాస్ట్ ఫుడ్ సెంటర్లు
- * వాడిన నూనె ను మరల వాడకం
- * కల్తీ నాణ్యత లోపంతో రోగాల భారిన పడుతున్న భోజన ప్రియులు
- * జాడలేని ఫుడ్ ఇన్స్పెక్టర్

మణుగూరు, సెప్టెంబర్ 10 (భారతశక్తి): ఇలా బతికితేనే మనిషి.. లేదంటే వీడెవడురా బాబూ అన్నట్టుచూస్తూ... ఆరోగ్యమే మహా భాగ్యం అనే మాటే మరిచారు. అందుకే ప్రస్తుతం జీవన ప్రమాణం పడి పోయింది. పూర్వం ఒక మనిషి 80 నుంచి 90 ఏళ్లు బతికేవాడు. మరి నేడు 50 ఏళ్లు వచ్చేసరికే రోగాలతో మంచమెక్కుతున్నాడు. రోజు రోజుకు మనిషి జీవన ప్రమాణ స్థాయి పడిపోతూనేఉంది. ఇటీవల 30 ఏళ్ల లోపు వారికి హార్ట్ స్ట్రోక్ లు రావడానికి ఇటువంటి ఆహారమే కారణం. కంటికి ఇంపుగా ముక్కుకు సొంపుగా వుంటే చాలు బయట ఫుడ్ను పిల్లలనుంచి పెద్దల వరకు తెగలాగించేస్తున్నారు. కాని బయట లభ్యమయ్యే ఆహారంలో కల్తీ జరుగుతుందనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు పట్టణంతో పాటు మండల కేంద్రాల్లో హోటల్స్, రెస్టారెంట్స్, స్వీట్ స్టాల్స్, దాబాలు, క్యాంటిన్లు, కర్రీపాయింట్లు ఉన్నాయి. ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా దంపతులిద్దరూ పనిచేస్తేనే కానీ రోజు గడవని పరిస్థితి. ఈనేపథ్యంలో మనిషి చాలా బిజీ అయ్యి ఇంటి వద్ద ఫుడ్ ను తయారు చేసుకుని తినే పరిస్థితులు చాలా వరకు తగ్గిపోయాయి. ఆకలి తీర్చుకునేందుకు బయట ఫుడ్ సెంటర్ల పై ఆధారపడుతున్నారు. వ్యాపారులు ఎక్కువ శాతం కనీస నిబంధనలు పాటించకుండా ఆహారాన్ని సిద్ధంచేస్తున్నారు. అదే తిని మనిషి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నాడు. ఫుడ్ అంటే కేవలం భోజనమే కాదండోయ్.. రకరకాలు ఉన్నాయి. బిర్యానీ మొదలుకొని స్వీట్స్, బజ్జీ నుంచి పిజ్జా వరకు అన్ని కెమికల్స్ వాడుతూ ఘుమ ఘుమలాడే మసాలాలతో తయారు చేస్తున్నారు. వాటిని తిన్నవారు రోగాల భారినపడడం కాయమనే వాదన వినిపిస్తోంది. వర్షాకాలంలో ఆహారంలో ఏ మాత్రం తేడాఉన్నా వెంటనే వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉంది.



**కల్తీ నాణ్యత లోపంతో అనేక రుగ్మతలు**

ఆహార పానీయాల విషయంలో కొందరు వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్నారు. పాడైన వాటిని పాడేయాల్సింది పోయి వాటికి ఫ్రెస్ లుక్ ఇచ్చి ఆహారపదార్థాలను అమ్మేయడంతో ప్రజలు వారికి తెలియకుండానే జబ్బు పడుతున్నారు. ముఖ్యంగా క్యాన్సర్, లివర్ పాడై జీర్ణవ్యవస్థ దెబ్బతినడం, వాంతులు, విరేచనాలు, శరీరంలో అనేక రుగ్మతల బారినపడుతున్నారు. దీనికి కారణం పాడైన ఆహారం తీసుకోవడమే. మణుగూరు మండలంలో హోటల్స్, రెస్టారెంట్స్, స్వీట్ స్టాల్స్, బేకరీలు, క్యాంటీన్లు, కర్రీ పాయింట్లు ఉన్నాయి. వాటిలో కొందరు చేస్తున్న కల్తీ, నాణ్యతలేమితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

**క్యాన్సర్ కు కారణమవుతున్న నూనెలు**

ఒకసారి కాచిన నూనెను మళ్లీ వినియోగించ కూడ దు. ఇదీ చాలా ప్రమాదం అయిన మిగిలి పోయిన నూనె ను పడవేయకుండా మరల వాడుతున్నారు. అది నల్లగా అయ్యే వరకూ వినియోగిస్తారు. దీంతో ఆ నూనె లో టీపీసీ స్థాయి 65 శాతంపైబడుతోంది. సాధారణంగా నూనెలో టీపీసీ శాతం 25శాతం కంటే తక్కువ ఉండాలి. ఇది చూడడానికి పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ 65 శాతం కంటే ఎక్కువ ఉన్న నూనెతో తయారు చేసిన ఆహారం తింటే కేన్సర్ కు దారితీస్తుంది. అయినా మరిగే నూనె నల్లగా ఉన్నా సరే ఆహార ప్రియులకు పట్టదు. వేడివేడిగా ఉన్నాయా లేదా అనుకుంటూనే తినేస్తాం. స్వీట్ స్టాల్స్ లో కలుపుతున్న కలర్స్ కారణంగా అవి పదిరోజులైనా తాజాగా కనిపిస్తాయి. ఆ కలర్స్ కారణంగా కొన్నిరకాల జబ్బులు వస్తాయి. నేతి మిఠాయిలనీ తయారు చేస్తున్నారు. వాటిలో 80 శాతం డాల్డాఉంటుంది. పైగా వాడే 20 శాతం నెయ్యి కూడా నాణ్యమైనది కాదు, ఇలా అనేక లోపాలు ఉన్నాయి. కొన్నిరకాల ఫుడ్స్ నిల్వ చేయడానికి వినియోగించే కెమికల్స్ వలన మనిషి ఆరోగ్యం పూర్తిగా హరిస్తుంది. కొన్ని స్వీట్స్ స్టాల్స్ దారుణంగా నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నాయి. ప్రస్తుతం సుగర్ పేషెంట్లు పెరగడానికి ఒత్తిడి ఒక కారణమైతే.. ఆహారం కూడా ఒక కారణమేనని వైద్యులు చెపుతున్నారు.

**రోజుల తరబడి ఫ్రిజ్ నిల్వ**

కొన్ని రెస్టారెంట్లు, హోటల్స్ నిర్వాహకులు ఫ్రిజ్ లో చికెన్, మటన్, ఫిష్, ప్రాన్ తదితర మాంసాహారాలను రోజుల తరబడి నిల్వ చేస్తున్నారు. ఆయా మాంసాలు గడ్డకట్టి పోయి అవి మళ్లీ సాధారణ స్థితికి చేరినప్పుడు జిగురువంటి పదార్థం వాటిపై కనిపిస్తుంది. అయితే ఈ మాంసాన్ని బాగా డ్రై చేసి కలర్ ఫుల్ మసాలా దట్టించి వండేయ్యడంతో అది బాగా డ్రై అయ్యి దాని వాసన పరిస్థితి తెలియడం లేదు. అలాగే కుళ్లిన కోడిగుడ్లను కూడా వదలడంలేదు.. అండాబజ్జి చేసేటప్పుడు వాటిలో కలిపేస్తున్నారు. మాంసాహారం ఏదైనా ఎటువంటి కెమికల్ కలపకుండా ఫ్రిడ్జ్ లో నిల్వచేస్తే కేవలం 3 రోజుల మాత్రమే ఫ్రెష్ గా వుంటుంది. కానీ వారం తరబడి నిల్వ చేయడం వల్ల అందులో బ్యాక్టీరియా చేరి దానిని తిన్నవారు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

**జాడలేని ఫుడ్ ఇన్స్పెక్టర్లు**

భద్రాద్రి జిల్లా మణుగూరు మండలంలో హోటల్స్, కర్రీ పాయింట్లు, బిర్యానీ పాయింట్లు ఉన్నాయి. అయినా అటువైపు ఆహార నియంత్రణ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. ఎక్కడికక్కడ కల్తీ, నాణ్యతలేమితో ఆహారపదార్థాలు తయారు చేస్తుంటే ఫుడ్ ఇన్స్పెక్టర్ మాత్రం చోద్యం చూస్తున్నారు. మండల కేంద్రంలోనే అనేక వ్యాపార సంస్థలు నాణ్యత లేమితో వండివార్చేస్తుంటే అది ఫుడ్ఇన్స్పెక్టర్ లకు కనిపించకపోవడం వెనుక పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని భోజన ప్రియులు కోరుతున్నారు.




## జోధ్ పూర్ లో ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ సమావేశాలు

*** బయలుదేరిన టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు..**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (భారత శక్తి):** రాజస్థాన్ లోని జోధ్ పూర్ లో ఈ నెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) 131వ జాతీయ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 30 మంది జర్నలిస్టు ప్రతినిధుల బృందం బుధవారం బయలుదేరి వెళ్ళింది. ఈ నెల 11,12,13 తేదీలలో జోధ్ పూర్ లో జరుగనున్న ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఐఎఫ్ డబ్ల్యూజే అనుబంధ సంఘం అయిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజే ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుడుతాడి బాపురావు, కంతేటి రమాదేవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, పొలుమారి గోపాల్, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల నాయకులు వాకిట అశోక్, కాలూరి శ్రీను, సి.బాలకృష్ణ, రఘురామ్, పరకాల సమ్మయ్య గౌడ్, రవీందర్ గౌడ్, ఎండీ రఫీ, వి.సంధ్య, తదితరులతో పాటు వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ నాయకులు జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు జోధ్ పూర్ వెళ్ళారు.

## పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



అమీన్ పూర్, సెప్టెంబర్ 10, (భారత శక్తి) : అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణారెడ్డిపేట పశు వైద్యశాలకు నూతనంగా విచ్చేసిన పశు వైద్యశాల డాక్టర్ సత్యనారాయణ ను వివిధ గ్రామాల రైతులు కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పశు వైద్యశాల వెటర్నరీ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నా వంతు బాధ్యతగా మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సంబంధించిన సమస్యలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పని చేస్తానని ఆయన అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో రైతులు పి బాల గౌడ్,వెంకటేష్ నరసింహులు,రాజు,జితేందర్, రాజు యాదవ్,వెంకటేష్, నరేష్ యాదవ్,వివిధ గ్రామాల రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.